
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు 5

బుధవారం 5 మార్చి 2025





	ఇఫ్తార్	సెహరి
	బుధవారం	గురువారం
కర్నూలు	6: 31	5:11
నంద్యాల	6: 28	5:11

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

- రెవెన్యూ అర్జీలను గడువులోపు పరిష్కరించాలి
- సర్వేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ రంజిత్ బాషా
- మండల సర్వేయర్‌కు షోకాజ్..
- విలేజ్ సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని కర్నూలు ఆర్డీవోకు ఆదేశాలు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

వెల్దుర్తి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాల్లో రీసర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన రైతుల అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. మండలంలోని పీజీఆర్ఎస్ సర్వే అర్జీలకు గడువు లోపుల పరిష్కారం చూపకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సర్వేయర్‌కు నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు. అలాగే రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభల వివరాలు సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి ఒక అర్జీ విలేజ్ సర్వేయర్ లాగిన్‌లో చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉండటం గమనించిన కలెక్టర్ ఆ విలేజ్ సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డు గదులను కార్యాలయ సిబ్బంది గదులను పరిశీలించి ఎంత మంది వీఆర్వోలు, ఎంత మంది సిబ్బంది ఉన్నారని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మండల తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలో ఏడుగురు డీబార్

654 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి మంగళవారం జరిగిన పబ్లిక్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఏడుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 24640 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 23979 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 654 మంది మంగళవారం గైర్హాజరయ్యారు. కోసిగి ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రంలో నలుగురు, కోసిగి నారాయణ కాలేజీలో ఒకరు, కర్నూలు మాస్టర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీలో ఒకరు, భాగ్యనగర్ శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఒకరు డీబార్ అయినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు.

కొత్త బిజినెస్.. హోం స్టే

మంత్రాలయంలో రద్దీ పెరగడంతో లాడ్జీలుగా మారిన ఇళ్లు



నాగలదిన్నె రోడ్డులో ఇంటిని హోం స్టేగా మార్చిన దృశ్యం

ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని ఇళ్లను కూడా లాడ్జీలుగా మార్చేస్తున్నారు. కొత్తగా హోం స్టే అనే మాట విరివిగా ప్రచారంలోకి వచ్చింది. దీని కోసం పదేళ్ల నుంచి అద్దెకు ఉంటున్న వాళ్లను యజమానులు నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. రోజువారీ అద్దె ప్రకారం భక్తుల నుంచి వసూలు చేస్తున్నారు. అద్దె ఇళ్లు కరువై స్థానికంగా పని చేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు ఇతర గ్రామాల నుంచి మంత్రాలయం వస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల తాకిడికి మంత్రాలయానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న పొలాల్లో సైతం లాడ్జీలను నిర్మిస్తున్నారు. గ్రామ పంచాయతీ, కుడా అనుమతులు కూడా తీసుకోకుండా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకుల అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందనే విమర్శలు ఉన్నాయి.

- పుట్టగొడుగుల్లా అనుమతి లేని లాడ్జీలు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- నోటీసులే తప్ప.. చర్యలేవీ..?
- అంతా నాయకుల అండదండలతోనే
- పంచాయతీ, కుడా ఆదాయాలకు భారీ గండి

మంత్రాలయం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో మిగతా రోజులకంటే శనివారం, ఆదివారం, గురువారం. ఇతర సెలవు రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. మంత్రాలయం పట్టణంతగా వస్తున్న భక్తులకు వసతి ఇబ్బందిగా మారింది. ప్రైవేటు, రాఘవేంద్రస్వామి మఠం గదులు సరిపోకపోవడం లేదు. రూ.400 ఉండే సాధారణ రూము అద్దె రూ.8వేలకు పెంచేశారు. గంటకు ఓ రేటు నిర్ణయించి ప్రైవేటు లాడ్జీల యజమానులు వసూలు చేస్తున్నారు. డబ్బున్నవారు వేరే వ్యాపారాలు వదిలిపెట్టి లాడ్జీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గత ఏడాది నుంచి 25 లాడ్జీలు నిర్మాణమయ్యాయి.



ఇంటిని లాడ్జీగా మార్చి నిర్మిస్తున్న దృశ్యం

- మంత్రాలయంలో 10,613 మంది జనాభా ఉండగా.. 3,550 గృహాలు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు లాడ్జీలు 85, మరో 15 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వీటన్నింటిని కలిపినా ప్రైవేలుగా 500 గదులు, రాఘవేంద్రస్వామి మఠానికి చెందినవి దాదాపు 1500 గదులు ఉన్నాయి. రద్దీ సమయాల్లో ఈ గదులు ఏ మాత్రం సరిపోవడం లేదు. మంత్రాలయంలో దాదాపు 10వేల మందికి వసతి కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయి. అయితే 50వేల మందికి పైగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో లాడ్జీలకు డిమాండ్ పెరిగింది.



అనుమతులు లేకుండా స్టే ఉండేందుకు షెడ్లు నిర్మిస్తున్న దృశ్యం

మిగతా 6వ పేజీలో

పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్న లాడ్జీలు, హోం స్టేలు

మంత్రాలయంలో కుడా, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా లాడ్జీలు హోం స్టేలు పుట్టుగొడుగుల్లా పుట్టుకవస్తున్నాయి. రామచంద్రనగర్, రాఘవేంద్రపురం, సంత మార్కెట్, నాగలదిన్నె రోడ్డు, సుజీయాంద్రనగర్, ఓల్డ్ టౌన్‌లో బాడుగలకు ఉన్న వారిని ఇండ్ల నుంచి బైటికి పంపి, ఆ ఇండ్లను ప్రభుత్వ అనుమతులు లేకుండా హోంస్టేలుగా మార్చేసి బాడుగలకు ఇస్తున్నారు. ఇంట్లో మూడు గదులు ఉంటే.. రోజుకు 5వేల దాకా సంపాదిస్తున్నారు. దీనికి పంచాయతీ అనుమతులు లేవు. విద్యుత్, అగ్నిమాపక శాఖ, కాలుష్యం, పార్కింగ్ స్థలాలు లేకుండానే నడుపుతున్నారు. కొత్త కాలనీలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కాలనీ మధ్యలో ఇండ్ల యజమానులు యధేచ్ఛగా గదులను హోం స్టేగా అద్దెకు ఇస్తున్నారు. దీని వల్ల చుట్టుపక్కల ఉన్న వాళ్లు ఇబ్బందిపడుతున్నారు.

కంది రైతుల నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కంది పంట నష్టంపై నివేదికలు అందజేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను కర్నూలు, నంద్యాల కలెక్టర్లు రంజిత్ బాషా, రాజకుమారి ఆదేశించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో కందిరైతుల కష్టాలపై ప్రచురితమైన కథనాలకు కలెక్టర్లు స్పందించారు. కంది రైతులకు జరుగుతున్న నష్టంపై నివేదికలు అందజేయాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు, హరినాథ్ రెడ్డిలను ఆదేశించారు. ఇదిలా ఉండగా కందుల కొనుగోలులో రాష్ట్రంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో ఇప్పటిదాకా 2,953 మంది రైతుల నుంచి 3,996 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశామని, వీరికి రూ.30.13 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.29.53 కోట్లును రైతులకు చెల్లించినట్లు కర్నూలు మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 2,400 మెట్రిక్ టన్నులను కందులను 1,756 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని రూ.19 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే 18.50 కోట్లు చెల్లించడం జరిగిందని నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథ్ రెడ్డి తెలిపారు.

వైద్యవృత్తి అత్యున్నతం


- కేఎంసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే
- 250 మంది వైద్యులకు పట్టాల పంపిణీ



6లో

ఉన్న నీరు ఇదే..!

- కర్నూలు జిల్లా రిజర్వాయర్లలో 5.512 టీఎంసీలు
- నంద్యాల జిల్లాలో 17.54 టీఎంసీలు
- వేసవి గండం గట్టెక్కేనా..!?
- రబీ పంటలకూ నీరివ్వాలి...
- జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు
- రేపు నీటి వనరులపై కలెక్టర్ రంజిత్‌బాషా సమీక్ష



శ్రీశైలం జలాశయంలో 847.20 అడుగులకు చేరిన నీటి నిల్వలు

గతేడాదితో పోలిస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎండలు తీవ్రత మధ్యనే రబీ పంటలకు ఈ నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. అంతర్రాష్ట్ర జలాశయాలైన శ్రీశైలం, తుంగభద్ర మినహాయిస్తే.. కర్నూలు జిల్లాలో ఐదు రిజర్వాయర్లలో 5.152 టీఎంసీలు, నంద్యాల జిల్లాలో ఆరు జలాశయాలో 17.54 టీఎంసీల నీరు ఉంది. వివిధ కాలువల పరిధిలో రబీ పంటలు చేతికి రావాలంటే నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా.. నీటి వృథాను అరికడితే వేసవి నీటిఎద్దడి తలెత్తకుండా ప్రజల దాహం తీర్చవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. నీటి నిల్వలపై కలెక్టర్ పి. రంజిత్‌బాషా గురువారం జలవనరుల శాఖ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్, టీబీపీ ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు, ఎస్సార్బీసీ, ఎన్టీఆర్ తెలుగుగంగ కాలువ పరిధిలో దాదాపుగా 3.36 లక్షల ఎకరాల్లో రబీ ఆయకట్టు సాగులో ఉంది. హంద్రీ నీవా కాలువ కింద రైతులు మరో 17 వేలు సాగు చేశారు. వివిధ దశల్లో ఉన్న రబీ పంటలు చేతికి రావాలంటే ఈ నెలాఖరు వరకు నీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కర్నూలు జిల్లాల్లో గాజులదిన్నె, సుంకేసుల, కృష్ణగిరి, పత్తికొండ, పులికనుమ జలాశయాల్లో 5.152 టీఎంసీలు, నంద్యాల జిల్లాలో వెలుగోడు, గోరుకల్లు, అవుకు, జుర్రేరు, వరద రాజుస్వామి గుడి, అలగనూరు జలాశయాల్లో 17.54 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది మే వరకు ఎండల తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండడంతో వేసవి నీటి ఎద్దడి నుంచి గట్టెక్కే అవకాశం ఉన్నా.. నీటి వృథాను అరికట్టడంతో పాటు నీటి పొదుపు పాటించకపోతే ఇబ్బందులు తప్పవని సాగునీటి నిపుణులు హెచ్చరిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఉండడదని, ఇప్పటి నుంచి నీటి వినియోగంపై పక్కా ప్రణాళికలు రూపొందించాలని పలువురు సూచిస్తున్నారు.

శ్రీశైలంలో 74.45 టీఎంసీల నీటి నిల్వలు

తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 74.15 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఈ నీటిని వినియోగించుకోవాలంటే కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆమోదం ఉండాలి. గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 215.8 టీఎంసీలకు గాను.. 847.20 అడుగుల్లో 74.15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇటీవల జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో శ్రీశైలం నుంచి ఏపీ నీటి వినియోగం ఆపేయాలని సూచించడంతో ప్రస్తుతం మాల్యాల పంప్‌హౌస్ నుంచి కేసీ కాలువకు 675 క్యూసెక్కులు, హంద్రీనీవా కాలువకు 674 క్యూసెక్కులు మాత్రమే తీసుకుంటున్నారు. ఏ క్షణమైనా ఎత్తిపోతలు ఆపేయవచ్చని అంటున్నారు. అదే జరిగితే సాగులో ఉన్న పంటల దిగుబడి ప్రశ్నార్థకంగా మారుతుంది. కేసీ కింద 92 వేల ఎకరాలు సాగులో ఉంది. ఎస్సార్బీసీ పరిధిలో 98 వేల ఎకరాలు, తెలుగుగంగ కాలువ పరిధిలో 1.14 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయని ఇంజనీర్లే అంటున్నారు. గోరుకల్లు, వెలుగోడు, అవుకు జలాశయాల్లో 17.281 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయి. పక్కా ప్రణాళికతో వినియోగిస్తే వేసవిలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

మిగతా 7వ పేజీలో

తహసీల్దార్లపై కలెక్టర్ ఆగ్రహం

నోటీసులు ఇవ్వాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సర్వీసులు, ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వహించిన తహసీల్దార్లపై కలెక్టర్ రంజిత్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దకడుబూరు, దేవనకొండ, చిప్పగిరి, పత్తికొండ తహసీల్దార్లకు నోటీసులు జారీ చేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీఓలను ఆదేశించారు. మంగళవారం తాగునీటి పరిస్థితి, ఎంఎస్ఎంఈ సర్వే, పీజీఆర్ఎస్ సర్వీసులు, ఎన్ఆర్ఈజీఎస్ తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రోజూ లక్ష మందికి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదుకున్న ఆర్గానిక్



- మందులు లేని పంటల సాగుతో అద్భుత ఫలితాలు
- యూఎస్ఏ, దుబాయ్‌కి దిగుబడుల ఎగుమతి
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు నరసింహులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని వెంకటగిరిలో రైతు నరసింహులు ఆర్గానిక్ పంటలను సాగు చేస్తూ లాభాల బాటలో నడుస్తున్నాడు. ఈయన పండించిన పంటలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామానికి చెందిన రైతు నరసింహులు వ్యవసాయంలో అందరి రైతుల మాదిరిగానే ప్రతియేట మిరప, పత్తి, బొబ్బాయి వంటి పంటలను సాగు చేస్తున్నాడు. అయితే పంటలకు పురుగు మందులతోపాటు కూలీల ఖర్చు అధికమైంది. అంతేగాక మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు ధర కూడా లభించడం లేదు. దీంతో నష్టాల పాలవుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఆర్గానిక్ వ్యవసాయం వైపు మళ్లాడు. అనుకున్నదే తడువుగా వెంకటగిరి గ్రామంలో తనకున్న భూమిలో ఆర్గానిక్ పంటలను సాగు చేయడం మొదలు పెట్టాడు. ఎకరన్నర పొలంలో రూ.60 వేలు ఖర్చు పెట్టి ఆర్గానిక్ పద్ధతిలో మిరప పంటను సాగు చేశాడు. దీంతో 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇతరుల సహకారంతో తాను పండించిన పంటను యూఎస్ఏకు క్వింటం ధర రూ.28 వేల ప్రకారం ఒప్పందం కుదుర్చుకొని ఎగుమతి చేసి దాదాపు రూ.5 లక్షల వరకు ఆదాయం పొందాడు.

వెంకటగిరి టు.. దుబాయ్

రైతు నరసింహులు ఈ ఏడాది సైతం ఆర్గానిక్ పద్ధతిలో తనకున్న రెండు ఎకరాల్లో దాదాపు రూ.లక్ష ఖర్చు పెట్టి బొప్పాయి సాగు చేశాడు. బెంగళూరులో తనకు తెలిసిన ఓ ఏజెంట్ ద్వారా దుబాయ్ వాళ్లతో ఒప్పందం కుదుర్చుకొని మొదటి కోతలో కేజీ బొప్పాయి ధర రూ.22 ప్రకారం విక్రయిస్తూ మంచి లాభాలను పొందుతున్నాడు. అంతేగాక హార్టికల్చర్ అధికారుల సహకారంతో ఎప్పటికప్పుడు పంటల సాగులో మెలకువలు తెలుసుకొని ఇతర రైతులకు ఆదర్శనంగా నిలుస్తున్నాడు.



పంట దిగుబడిని వెంకటగిరి నుండి దుబాయ్‌కు సరఫరా చేస్తున్న దృశ్యం

ఓ దశలో వ్యవసాయాన్ని వదిలేసుకుందామనుకున్న



ప్రతియేటా మిరప, పత్తి, బొప్పాయి పంటలను సాగు చేస్తూ వచ్చేవాడిని. రసాయన మందులను అధికంగా పిచికారి చేయడం, పిచికారి చేసినా పంటలకు సోకిన వైరస్‌లు తగ్గక పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేవి కాదు. విసిగిపోయి ఆర్గానిక్ పంటలను సాగు చేయడం మొదలు పెట్టాను. ఆర్గానిక్ వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉండడమేగాక లాభాలు కూడా బాగానే కనిపించాయి. దీంతో ఆర్గానిక్ పంటలను సాగు చేస్తూ వస్తున్నా.

నరసింహులు, రైతు

ఆర్గానిక్ వ్యవసాయం చేస్తే రైతులకు మంచి లాభాలు



ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయి. రసాయన ఎరువులతో పండించిన పంటలకు ధర తక్కువగా ఉంటుంది. అలాగే భూసారం కూడా తగ్గి పంటల దిగుబడి తగ్గుతుంది. రైతులు తప్పకుండా ఆర్గానిక్ వ్యవసాయం చేసి లాభాల బాటలో పయనించాలి.

-శ్రీవాణి, హార్టికల్చర్ అధికారి

రసాయన, ఆర్గానిక్ ధరల వ్యత్యాసం

రసాయనిక మందులను వాడుతూ సాగు చేసే మిరప పంట రకాన్ని బట్టి క్వింటం రూ.6 వేల నుంచి రూ. 15 వేలు పలుకుతోంది. అంతేగాక పిచికారి మందులను వాడి పండించిన పంటకు మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉంటుంది. అలాగే పెట్టుబడి ఖర్చులు, పంటకు తెగుళ్లు సైతం ఎక్కుకుగా సోకుతాయి. కొన్ని సార్లు ముడత ప్రభావం, మొక్కలు ఎండిపోవడంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బొప్పాయి పంటలో సైతం రసాయన మందుల వాడకంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతాయి. రసాయన మందులతో పండించిన బొప్పాయి పంటను కిలో రూ.15 నుంచి రూ.17 వరకు కొనుగోలు చేస్తారు. అదే ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసే బొప్పాయి దిగుబడి ఎక్కువ రావడమేగాక కిలో రూ.25 నుంచి రూ.28 వరకు కొనుగోలు చేస్తారు. రవాణా ఖర్చులు సైతం దిగుమతి చేసుకునే వారే భరిస్తారు.



ఆర్గానిక్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ, హార్టికల్చర్ అధికారులు

తుంగాతీరం.. జనసంద్రం

- ఘనంగా కొనసాగుతున్న గురు వైభవోత్సవాలు
- రాఘవరాయడికి విశేష పంచామృతాభిషేకం



భజన మండళ్లను ఉద్దేశించి మట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం తుంగాతీరాన ఉన్న శ్రీమఠం వేలాది మంది భక్తులతో జనసంద్రంగా మారింది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రులకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రాఘవరాయలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్తవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, బంగారు రథాలపై ఘనంగా ఊరేగించారు. పరిమళ న్యాయ సుధ పరీక్షలను యాగశాలలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వ్యాసరాజమఠం స్వామీజీ విద్య విజయతీర్థులు పండిత కేసరి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వేద పండితుల మధ్య ఇష్టాగోష్టి నిర్వహించారు. ఇందులో పరిమళ న్యాయసుధ గ్రంథం పూర్తి చేసుకున్న ఇద్దరు విద్యార్థులు పీఎస్ రాఘవేంద్ర, వాది సింహ ఉత్తీర్ణత సాధించారు. వైభవోత్సవాలకు ముఖ్యఅతిథులుగా వచ్చిన వ్యాసరాజ మఠం స్వామీజీ విద్య విజయతీర్థులకు శ్రీమఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. రాత్రి బెంగుళూరు చెందిన బృందావన్ కళానికేతన్ నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది.

ప్రముఖులకు అవార్డులు ప్రదానం: గురు వైభవోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాలలో బళ్లారి ఎంపీ తుకారాం, బెంగుళూరు చెందిన విద్వాన్ కేశవాచార్యులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వ్యాసరాజ మఠం స్వామీజీ విద్య విజయతీర్థులు అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్వాన్, రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవి కులకర్ణి, వ్యాసరాజాచార్, వాధిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, జేసీ స్వామి, డీఎం ఆనందరావు, వేణుగోపాలాచార్, రమేషాచార్, కడప రాఘవేంద్రాచార్, హనుమేషాచార్ తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి ఎంపీ తుకారాంకు అవార్డును ప్రదానం చేస్తున్న వ్యాజరాజ మఠం స్వామీజీ విద్యావిజయతీర్థులు

కొత్త బిజినెస్.. హోం స్టే



టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న రామచంద్రనగర్ కాలనీవాసులు

(5వ పేజీ తరువాయి)

మంత్రాలయంలో పలు కాలనీల్లో బాడుగలకు ఉన్న వారిని ఖాళీ చేయించి భక్తులకు రోజువారి బాడుగలకు గదులు ఇవ్వడం పట్ల ఆగ్రహించిన మహిళలు తహసీల్దార్ ఎస్.రవికి, పోలీసులకు, టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి, పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు, ఈవోఆర్డీ ప్రభావతిదేవికి గతంలో ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు.

అనుమతులు లేని లాడ్జీలే ఎక్కువ

మంత్రాలయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలం, ఫైర్, కాలుష్యం, వెలుతురు, నీరు వంటి సదుపాయాలు ఉంటేనే లాడ్జీలకు అనుమతులు ఇవ్వాలి. కానీ ఇలాంటి అనుమతులు లేకుండా, ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది.. ఆ ఇంట్లోనే గ్రౌండ్ ఫ్లోర్, జీ+2లకు అనుమతులు పొంది.. 3, 4, 5 అంతస్థుల వరకు నిర్మించుకుంటున్నారు. ఇలాంటి నిర్మాణాలకు పాల్పడిన 18 మందికి పంచాయితీ వారు నోటీసులు జారీ చేశారు.

లాడ్జీల వాహనాలన్నీ రోడ్డుపైనే.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు

మంత్రాలయంలో ప్రైవేటు లాడ్జీలకు పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో మంత్రాలయం రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేసి గదులు అద్దెకు తీసుకుంటున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతోనే ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

శ్రీమఠం గదులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు

రాఘవేంద్రస్వామి మఠం తరపున గదులు తీసుకున్న వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. మరో 15 ఎకరాల్లో ఎంపీడీవో కార్యాలయం వద్ద కారు పార్కింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. శ్రీమఠం తరపున పార్కింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినా ప్రైవేటు లాడ్జీల యజమానుల వల్లనే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. గత రెండు నెలల నుంచి తాత్కాలిక షెడ్లలో గదులను సుందరంగా తీర్చిదిద్ది, డబ్బు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మంత్రాలయం లాడ్జీలు, హోంస్టేలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మించుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం



మంత్రాలయంలో గత ఆరు నెలల నుంచి అక్రమంగా నిర్మిస్తున్న లాడ్జీలు, హోంస్టేలుగా మారిన ఇండ్ల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. అనుమతులు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు.

- తెల్లబండ్ల భీమయ్య, సర్పంచ్, మంత్రాలయం

మా కాలనీలో ఎవరు వచ్చి వెళ్తున్నారో తెలియడం లేదు



రామచంద్రనగర్‌లో మా ఇల్లు ఉంది. గత ఐదు నెలల నుంచి మా పక్కింటి వారు అద్దెకు ఉంటున్నవారిని ఖాళీ చేయించి భక్తులకు హోంస్టేగా గదులు అద్దెకు ఇస్తున్నారు. ఎవరి వచ్చి వెళ్తున్నారో.. ఏం పనులు మీద వస్తున్నారో, అక్కడేం జరుగుతోందో మాకు తెలియడం లేదు.

- బొంబాయి ఈరన్న, రామచంద్రనగర్ కాలనీ, మంత్రాలయం:

హోంస్టేల పేరుతో భక్తులకు గదులు ఇస్తున్నారు



హోంస్టేల పేరుతో మా పక్కింటి వారు భక్తులకు గదులు ఇస్తున్నారు.. వారు భక్తులో, ప్రేమికులో, దొంగలో మాకు తెలియడం లేదు. వారి నుంచి మాకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఇట్లా ఇళ్లను రోజువారీ అద్దెకు ఇవ్వడం సరికాదు.

- లత గృహిణి, మంత్రాలయం

అనుమతులు తీసుకోకపోతే.. పంచాయతీ ఆదాయానికి గండి



ఇండ్లనే లాడ్జీలుగా, హోంస్టేలుగా మారిస్తే పంచాయతీ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతులు పొందాలి. అలా అనుమతులు తీసుకోకుంటే పంచాయతీ ఆదాయానికి గండి కొట్టి కాలనీవాసులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. వెంటనే నోటీసులు ఇచ్చి లాడ్జీలను, హోంస్టేలను తొలగిస్తాం

- ప్రభావతిదేవి, ఈవోఆర్డీ మంత్రాలయం

రేనాటి అమ్మ బిడ్డ

- ఎస్ఐగా ఎంపికై తల్లికి సెల్యూట్
- వ్యవసాయ కుటుంబం నుంచి ఎదిగిన శివనాగిరెడ్డి



ఎస్ఐగా ఎంపికైన శివనాగిరెడ్డితో తల్లిదండ్రులు

రుద్రవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రమ ఆయుధం అయితే.. విజయం బానిస అవుతుందన్న మాటలను నిజం చేసి చూపించాడు రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన రేనాటి శివనాగిరెడ్డి. ఎస్ఐ కావాలన్న లక్ష్యంతో పట్టుదలతో చదివి ఉద్యోగాన్ని సాధించిన ఆయన కడప జిల్లాలో పోస్టింగ్ సాధించి సొంతూరుకు చేరుకున్నారు. గ్రామస్థులతో పాటు స్నేహితులు మంగళవారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. పోలీస్ యూనిఫాంలో వచ్చిన శివనాగిరెడ్డి ముందుగా తల్లి లక్ష్మిదేవికి సెల్యూట్ చేసి పాదాభివందనం చేశారు. తండ్రి రేనాటి అంకిరెడ్డిని హత్తుకుని విజయానందాన్ని పంచుకున్నారు. ఈ సన్నివేశాన్ని చూసిన గ్రామస్థులు ఉద్వేగానికి లోనై శివనాగిరెడ్డిని అభినందించారు. శివనాగిరెడ్డి 2024లో ఎస్ఐగా ఎంపికై అనంత పురంలోని పీటీసీలో శిక్షణ పొందారు. ప్రభుత్వం మొదటి పోస్టింగ్ కడప జిల్లాలో ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన ఆయన దాదాపు ఐదేళ్ల పాటు పట్టుదలతో చదివి ఎస్ఐ కొలువు సాధించారు.



ఎస్ఐగా ఎంపికై తల్లి లక్ష్మిదేవికి వందనం చేస్తున్న కొడుకు

మా తల్లిదండ్రుల కల



మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మానాన్నలు నన్ను పోలీస్ యూనిఫాం దుస్తుల్లో చూడాలని చిన్నప్పటి నుంచి కోరిక ఉండేది. వాళ్ల కలను ఎలాగైనా సాకారం చేయాలని అనుకున్నా. వేరే వ్యాపకాలు ఏవీ పెట్టుకోకుండా కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించా. ఇప్పుడు కుటుంబం అంతా సంతోషంగా ఉంది. మొదటి పోస్టింగ్ కడప జిల్లాలో ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

- రేనాటి శివనాగిరెడ్డి, ఎస్ఐ

వైద్యవృత్తి అత్యున్నతం

- కేఎంసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే
- 250 మంది వైద్యులకు పట్టాల పంపిణీ





తల్లిదండ్రులతో హాజరైన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి ఎంతో ఉన్నతమైందని అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ అన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో 2019 బ్యాచ్ వైద్యవిద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అకడమిక్ డీఎంఈ జి.రఘునందన్, రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల విద్య తర్వాత వైద్య వృత్తిలో అడుగుపెడుతున్న వైద్యులకు అభినందనలు తెలిపారు. వైద్యులుగా రాణించాలని, వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యవృత్తిలో విలువలు అత్యంత అవసరమని, విలువలతో కూడిన వైద్యాన్ని రోగులకు అందించాలన్నారు. ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ కొత్తగా వైద్యవృత్తిలో అడుగుపెడుతున్న వైద్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులకు ఎంబీబీఎస్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ సాయిసుధీర్, హరిచరణ్, ఏ.రేణుకాదేవి, బి.విజయానందబాబు తదితరులు పాల్గొన్నారు.



అకడమిక్ డీఎంఈ జి.రఘునందన్‌ను సత్కరిస్తున్న దృశ్యం



గోల్డ్ మెడల్ పొందిన వైద్యులు వీరే...

అనాటమి విభాగం : టి.హర్షిత
ఫిజియాలజి విభాగం : ధనారెడ్డి, లక్ష్మి, నరహరి రెడ్డి
బయోకెమిస్ట్రి విభాగం : టి.హర్షిత, జీజీ మానస
ఫార్మాకాలజి విభాగం : నవలూరి శ్రీనాగ ఈశ్వరి
పెథాలజి విభాగం : జీజీ మానస
మైక్రోబయాలజీ విభాగం : నాగలూరి శ్రీనాగ ఈశ్వర్
ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం : ధనిరెడ్డి, లక్ష్మి నరహరి రెడ్డి
ఈఎన్‌టీ అండ్ ఆప్తమాలజి విభాగం : కంచి జయశ్రీ, వైష్ణవి వర్మ
కమ్యూనిటీ మెడిసిన్ విభాగం : మద్దిపట్ల మనోజ్ నాయుడు
పీడీయాట్రిక్ అండ్ గైనిక్, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలపి విభాగం : నాగలూరి శ్రీనాగ ఈశ్వర్
సర్జరీ విభాగం : ధనలక్ష్మి, లక్ష్మినరహరి రెడ్డి

ఉన్న నీరు ఇదే..!


గాజులదిన్నె జలాశయంలో ఉన్న నీటి నిల్వలు 2.57 టీఎంసీలు

(5వ పేజీ తరువాయి)

గాజులదిన్నె ఆధారం..

కర్నూలు జిల్లాలో కర్నూలు నగరం సహా వివిధ గ్రామాలు, నంద్యాల జిల్లాలో డోన్ పట్టణాలకు వేసవి దాహం తీర్చే ప్రాణనాడి గాజులదిన్నె జలాశయం. గత ఏడాది అడుగంటిపోయింది. ఈ ఏడాది టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, ఇంజనీర్లు ముందస్తు ప్రణాళికతో హంద్రీనీవా కాలువ, టీబీపీ ఎల్లెల్సీ నుంచి నీటిని తీసుకొని గాజులదిన్నె ప్రాజెక్టులో నిల్వ చేశారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 377 మీటర్లు, పూర్తిస్థాయి సామర్థ్యం 4.5 టీఎంసీలకు కాగా.. 374.89 మీటర్లలో 2.57 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. అందులో లైవ్ కెపాసిటీ 1.92 టీఎంసీలు. కుడి ఎడమ కాలువల కింద 12,300 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఈ పంటలు చేతికి రావాలంటే 0.90 టీఎంసీలు అవసరమని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. మిగిలిని ఒక టీఎంసీ నీటితో వేసవిలో పుష్కలంగా తాగునీరు ఇవ్వవచ్చని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. అయితే.. నీళ్లు ఉన్నాయి కదా అని విచ్చలవిడిగా వాడేస్తే ఇబ్బందులు తప్పవంటున్నారు. హంద్రీనీవా పరిధిలో కృష్ణగిరి రిజర్వాయర్‌లో 0.161 టీఎంసీలు, పత్తికొండ జలాశ యంలో 0.75 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పులికనుమ జలాశయంలో 0.79టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి.

కర్నూలు జిల్లాలో నీటి నిల్వలు (టీఎంసీలు)

జలాశయం	గరిష్ఠం	ప్రస్తుతం
గాజులదిన్నె	4.5	2.57
సుంకేసుల	1.20	0.881
క్రిష్ణగిరి	0.164	0.161
పత్తికొండ	1.126	0.75
పులికనుమ	1.243	0.79
మొత్తం	**8.533**	**5.152**

నంద్యాల జిల్లాలో నీటి నిల్వలు (టీఎంసీలు)

జలాశయం	గరిష్ఠం	ప్రస్తుతం
వెలుగోడు	16.95	6.536
గోరుకల్లు	12.5	8.92
అవుకు	4.14	1.895
జుర్రేరు	0.266	0.12
వరదరాజస్వామి	0.389	0.148
అలగనూరు	2.965	--
మొత్తం	**37.213**	**17.549**

అంతర్‌రాష్ట్ర జలాశయాల్లో నీటి నిల్వలు (టీఎంసీలు)

శ్రీశైలం	215.80	75.47
తుంగభద్ర	105.78	32.49

తుంగభద్రలో 5.61 టీఎంసీలు నీటి వాటా..

రాయలసీమకు జీవనాధారమైన తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం ఆశాజనకంగా నీటి నిల్వలు ఉన్నాయి. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 105.78 టీఎంసీలుగాను.. 1606.14 అడుగుల వద్ద 30.57 టీఎంసీలు నిల్వ ఉంది. ఈ ఏడాది 198 టీఎంసీలకు లెక్క గట్టి కేసీ నీటి వాటా 10 టీఎంసీలకు గాను 9.34 టీఎంసీలు కేటాయించారు. అందులో 3.50 టీఎంసీలు హెచ్చెల్సీ కాలువ ద్వారా అనంతపురం జిల్లాకు మళ్లించారు. ఇప్పటికే 4.23 టీఎంసీలు కేసీసీ వాటాగా వాడుకున్నారు. మిగిలిన 1.61 టీఎంసీలు విడుదల చేయాలని ఇండెంట్ ఇచ్చారు. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) నీటి వాటా 24 టీఎంసీలు కాగా 2024-25 నీటి సంవత్సరంలో 22.53 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికే 17.53 టీఎంసీలు వినియోగించుకోగా.. 5 టీఎంసీలు మిగులు వాటా ఉందని ఇంజనీర్లు తెలిపారు. సాగులో ఉన్న 45 వేల ఎకరాలకు 4 టీఎంసీలు ఇచ్చినా.. వేసవి తాగునీటి అవసరాలకు ఒక టీఎంసీ నీరు ఉంటుందని అంటున్నారు. సుంకేసులలో ప్రస్తుతం 0.881 టీఎంసీలు ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి 153 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని ఇంజనీర్లు తెలిపారు. మార్చి 31 నాటికి కనిష్ఠంగా 0.60 టీఎంసీలు నిల్వ ఉంచినా కర్నూలు నగర ప్రజలకు వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా తాగునీరు ఇవ్వవచ్చని ఇంజనీర్లు తెలిపారు.

6న నీటి నిల్వలపై కలెక్టర్ సమీక్ష

రబీలో పంటల అవసరం, వేసవిలో తాగునీటి సరఫరా, ప్రస్తుతం ఆయా జలాశ యాల్లో ఉన్న నీటి నిల్వలపై సమీక్షించేందుకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం జలవన రుల శాఖ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జలాశయాల వారిగా పూర్తి వివరాలతో రావాలని ఇంజనీర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే.. ఈ సమావేశానికి గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్లను కూడా పిలిస్తే.. రెండు శాఖల ఇంజనీర్ల మధ్య సమన్వయం ఏర్పడుతుందని, ఎల్లెల్సీ పరిధిలో ఎస్ఎస్ ట్యాంకులలో నీటిని నింపేందుకు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో కమిటీ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

బళ్లారి చౌరస్తాలో రోడ్డు ప్రమాదం

• హాస్టల్ వార్డెన్ దుర్మరణం


కృష్ణారెడ్డి(ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం పలువురిని కలిచివేసింది. ఒక ఆటో డ్రైవర్ తప్పిదం.. లారీ డ్రైవర్ అతివేగం, మోటారు సైకిలిస్టు అజాగ్రత్త కారణంగా ఓ రిటైర్డ్ వార్డెన్ దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసు కుంది. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామా నికి చెందిన కృష్ణారెడ్డి(67) లద్దగిరి బీసీ హాస్టల్‌లో 16 ఏళ్లు వార్డెన్‌గా విధులు నిర్వర్తించాడు. రిటైర్మెంట్ అయి కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ వెనుక వైపు ఉన్న పంచరత్న కాంప్లెక్స్ వీధిలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య విజయలక్ష్మి, ఒక కొడుకు, ఒక కూతురు సంతానం. రెండు నెలల క్రితం భార్య కూడా మృతి చెందింది. కృష్ణారెడ్డి ప్రతిరోజు దుర్గా హోటల్ వద్దకు వచ్చి అక్కడ బైక్‌ను పార్కింగ్ చేసి వాకింగ్ వెళ్తుంటాడు. రోజు మాదిరిగానే మంగళవారం కూడా తన స్కూటర్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. హైదరాబాదు వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్ పక్కన డీమార్టు వద్దకు వచ్చేసరికి ఒక లారీని ఓవర్‌టేక్ చేయబోయాడు. ఓవర్‌టెక్ చేస్తుండగా.. ఎదురుగా ఓ ఆటో రాంగ్ రూట్‌లో వచ్చింది. ఆటో డ్రైవర్ కూడా కాస్త అజాగ్రత్తగా ఉండటంతో కృష్ణారెడ్డి తన బైకును ఎడమవైపునకు తీసుకున్నాడు. అప్పటికే వేగంగా వెళ్తున్న లారీ కృష్ణారెడ్డిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడ్డ కృష్ణారెడ్డిపైన లారీ టైర్లు వెళ్లాయి. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో టైర్లు కృష్ణారెడ్డి మృతదేహాన్ని కొంత దూరం ఈడ్చుకెళ్లాయి. దీంతో ఆయన మృతదేహం ఛిద్రమైంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. ఆర్టీసీ బస్సు బోల్తా ..

- సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ ..
- 16మందికి గాయాలు .. నలుగురికి తీవ్ర అస్వస్థత ..
- పొలంలో పడటంతో తప్పిన ప్రాణ నష్టం ..
- మెరుగైన చికిత్స అందించాలని మంత్రి బీసీ సూచన



పొలంలో బోల్తాపడ్డ బస్సు, గాయపడ్డ ప్రయాణికుడు

కొలిమిగుండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాల మీదకు తెచ్చింది. మండలంలోని కల్వటాల సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు బోల్తా పడి 16మంది ప్రయాణికులు గాయపడ్డారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె(హైర్) బస్సు (ఎపి 39 యూవీ 4299) జమ్మలమడుగు నుండి తాడిపత్రికి 34మంది ప్రయాణికులతో బయల్దేరింది. డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కల్వటాల సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే 10అడుగుల లోతు ఉన్న వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చెయొద్దని ప్రయాణికులు చెబుతున్నా వినకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కూలీలు, వాహనచోదకులు సహాయక చర్యలు చేపట్టారు. నందిపాడుకు చెందిన సుబ్బలక్షమ్మ, రామలక్షమ్మ, డ్రైవర్ ఎస్.మహబూబ్ బాషా, నారాయణ తీవ్రంగా గాయపడ్డారు. కల్వటాలకు చెందిన మూగెన్న, కండక్టర్ జీవన్‌కుమార్, రాగిణి, లక్ష్మి, ఆదెమ్మ, కడప జిల్లాకు చెందిన మరికొంత మంది ప్రయాణికులు గాయపడ్డారు. సీఐ రమేశ్‌బాబు తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. 108 అంబులెన్స్‌ల్లో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అవుకు, బనగానపల్లె క్లస్టర్ ఆసుపత్రులకు తరలించారు. సుబ్బలక్షమ్మతో పాటు మరో మహిళకు తీవ్ర గాయాల కారణంగా కర్నూలుకు తరలించినట్లు స్థానిక వైద్య సిబ్బంది వెల్లడించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే బస్సు బోల్తా పడిందని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బస్సు బోల్తా ఘటనపై మంత్రి బీసీ ఆరా

బనగానపల్లె, మార్చి4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడ్డ ఘటనపై రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఆరా తీశారు. గాయపడ్డ 20మంది ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి బీసీ వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు సరైన చికిత్సలు నిర్వహించాలని అవుకు, బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

మమ్మల్ని మోసం చేశాడు: రైతులు

సి. బెళగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబందహాల్ గ్రామానికి చెందిన సర్వేస్వరరెడ్డి కుమారుడు హరికుమార్‌రెడ్డి 12 సంవత్సరా లుగా సి బెళగల్ కెనరా బ్యాంక్‌తో ఒప్పందం చేసుకుని బ్యాంక్ బీసీ పాయింట్ నడుపుకుంటూ తమను మోసం చేశాడని బాధిత రైతులు తెలిపారు. చింత మానుపల్లె, పలుకుదొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి, సి.బెళగల్, కబందహాల్ గ్రామాల రైతులు 20 రోజుల నుంచి హరికుమార్‌రెడ్డి ఫోన్ ఆఫ్‌లో ఉందని, కెనరా బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించగా.. తమకు తెలియదని చెప్పారని వారు అన్నారు. బాధిత రైతులు మంగళవారం పోలీసు స్టేషన్ ముందు కూర్చుని హరికుమార్‌రెడ్డికి ఎవరు ఎంత డబ్బు ఇచ్చిందీ తెలిపారు. ఈ మేరకు బాధిత రైతులు రాఘవరెడ్డి, ఓంకారం, మాలన్న, ఎల్లారెడ్డి, తిరుమలరెడ్డి, జయరామి రెడ్డి, శ్రీరాముడు, నరసింహగౌడు, నరసింహుడు, నాగన్న, శ్రీనివాసులు, లక్ష్మన్న, రంగస్వామి ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ బాధితులంతా వచ్చాక విచారణ చేపడతామని అన్నారు.


మాట్లాడుతున్న బాధిత రైతులు

రమణీయం.. జోడు రథోత్సవం

• ఆకట్టుకున్న గొరవయ్యల నృత్యం


భక్తుల మధ్య సాగుతున్న జోడు రథోత్సవం


ఆకట్టుకున్న గొరవయ్యల నృత్యం


పత్తికొండ : జూటూరు గ్రామంలో సంజీవరాయ రథోత్సవం

హాలహర్వి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామంలోని గాదిలింగేశ్వర స్వామి, సిద్దేశ్వర స్వామి జోడురథోత్సవాలు రమణీయంగా సాగాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు హాజర్యారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. దేవదాయ శాఖ రాధాకృష్ణ, కరణం రాఘవేంద్రరావు, రెడ్డి రఘునందన్ గౌడ్, కురువ మల్లన్న రథచక్రాలకు పూజలు నిర్వహించారు. మంగళ హారతులతో వేద పండితులు మంత్రాలు వల్లిస్తుండగా రథాలను ముందుకు కదిపారు. జోడు రథోత్సవాలు ముందుకు సాగాయి. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై చంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉల్లిగమ్మ, కమిటీ సభ్యులు లింగమల్లప్ప, కుమారప్ప, బజారప్ప, వీరేశప్ప పాల్గొన్నారు.

ఘనంగా సంజీవరాయ రథోత్సవం

పత్తికొండ: జూటూరు గ్రామంలో మంగళవారం సంజీవరాయ రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం రథాంగహోమం నిర్వహించారు. సాయంత్రం రథోత్స వాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఈశ్వరప్ప, విజయ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. సీఐ జయన్న బందోబస్తు నిర్వహించారు.

కరెంటు ఉచ్చుల బారిన కణతులు

- ఇద్దరు వేటగాళ్లు పరార్
- అటవీ అధికారుల అదుపులో ఒకరు
- ముగ్గురిపై కేసు నమోదు

కొత్తపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని గుమ్మడాపురం ఫారెస్టు బీట్‌లో వేటగాళ్లు విద్యుత్ వైర్లతో వేసిన ఉచ్చుల్లో పడి రెండు కణతులు మృతి చెందాయి. ముగ్గురు వేటగాళ్లలో ఇద్దరు పరారిలో ఉండగా.. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఆత్మకూరు అటవి శాఖ రేంజ్ అధికారి పట్టాబి తెలిపారు. సోమవారం రాత్రి గుమ్మడాపురం బీట్ లోని విద్యుత్ స్తంభాలకు పెద్దగుమ్మడాపురం గూడేనికి చెందిన లింగస్వామి, అంకన్న అనే వేటగాళ్లు విద్యుత్ జే వైర్లను అమర్చారని తెలిపారు. వీటిలోపడి రెండు కణతులు మృతి చెందాయని ఆయన తెలిపారు. తమ రాక గ్రహించి వారు పరారయ్యారన్నారు. గుమ్మడాపురం గూడెంలో డాగ్ స్క్వాడ్ తనిఖీ చేస్తుండగా.. అదే గూడెంలో ఉన్న మాజీ సర్పంచ్ శంకరయ్య ఇంట్లోకి డాగ్ స్క్వాడ్ వెళ్లినట్లు చెప్పారు. ఆ ఇంటిని పరిశీలిస్తుండగా.. కుందేళ్లు, నెమళ్లకు వేసే ఉచ్చులు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని శంకరయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం మృతి చెందిన రెండు కణతులకు పోస్టుమార్టం నిర్వహించి, కాల్చివేశామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని, పారిపోయినవారిని కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు రేంజ్ అధికారి పట్టాబి తెలిపారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

• నంద్యాల కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు కల్పించే నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామికరంగ అభివృద్ధికి ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అన్నారు. వారు నూతన పరిశ్రమల ఏర్పాటుకు సత్వరం అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ జవహర్‌బాబు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నెలాఖరు దాకా ఎల్లెల్సీ నీరు విడుదల

- గోనెగండ్ల సెక్షన్‌కు 110 క్యూసెక్కుల నీరు
- కోడుమూరుకు ఎల్లెల్సీ, జీడీపీ నీరు కలిసి 150 క్యూసెక్కులు


టైల్‌డ్యాంను పరిశీలిస్తున్న ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి

గోనెగండ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మార్చి నెల ఆఖరు వరకు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు సాగునీరు తుంగభద్ర డ్యాం నుంచి విడుదల అవుతుందని జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా ఇరిగేషన్ అధికారులు ఎమ్మిగనూరు గుడికల్ చెరువు నుంచి గోనెగండ్ల సెక్షన్ వరకు ఉన్న ఎల్లెల్సీ కాలువను చూశారు. గోనెగండ్ల దగ్గర ఎస్కేప్ చానల్ ద్వార ఎల్లెల్సీ నీటిని గాజులదిన్నె ప్రాజెక్టులోకి పంపే చానల్‌ను పరిశీలించారు. అలాగే టైల్‌డ్యాం, 4/7 కోడుమూరు సెక్షన్ బార్డర్ లో ఉన్న కర్నూలు బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. కాలువ గట్లపై పెరిగి ముళ్ల చెట్లను తొలగించాలని కింది స్థాయి ఉద్యోగులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ దెబ్బతిన్న కాలువ గట్ల పనులకు అంచనా వేసి తమకు పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎల్లెల్సీ కింద పంటలు సాగు చేసుకున్న రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు. ఈ నెల చివరి వరకు నీటి విడుదల ఉంటుందని ఆలోగా ఆయకట్టు పొలాలో సాగు చేసుకున్న పంటలు అన్నీ చేతికి అందుతాయని అన్నారు. ప్రస్తుతం గోనెగండ్ల సెక్షన్‌కు 110 క్యూసెక్కల నీరు మంగళవారం చేరిందన్నారు. కోడుమూరు ఎల్లెల్సీ సెక్షన్‌కు గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీ నీటి కోట నుంచి 84 క్యూసెక్కులు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 66 క్యూసెక్కుల నీరు కలిసి 150 క్యూసెక్కుల నీరు మళ్లిస్తున్నట్లు తెలిపారు. గోనెగండ్ల సెక్షన్‌కు 26 క్యూసెక్కులు వాడుకుంటున్నట్లు అందులో గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌లకు, ఎంఎల్ఎస్‌పీ, పీడీ, డీపీ 86 కాలువలకు మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈ బాలచంద్రరెడ్డి, ఎమ్మిగనూరు డీఈ విద్యాసాగర్, జీడీపీ డీఈ విజయ్ కుమార్, ఎల్లెల్సీ జీడీపీ ఏఈలు ఉదయ్ భాస్కర్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

అందరి వల్లే క్లస్టర్ వర్సిటీ అభివృద్ధి

• వీడ్కోలు సభలో ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్


పుస్తకాన్ని విడుదల చేస్తున్న వీసీ

కర్నూలు అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అందరి కృషి వల్లే క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధి చెందిందని ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. మంగళ వారం సిల్వర్ జూబ్లీ కళాశాలలోని ఆడిటోరియంలో ఉపకులపతి వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'ఉపకులపతిగా నేను అనే' ఆయన ఆత్మకథ పుస్తకాన్ని అవిష్కరించారు. వర్శిటీకి మొదటి ఉపకులపతిగా అవకాశం రావడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తానన్నారు. ఈ వర్శిటీ రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యా లయంగా భవిష్యత్‌లో వెలుగొందుతుందని అన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీలో నిపుణులైన ఆధ్యాపకులు ఉండడం విద్యార్థులకు వరమన్నారు. మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అందరి సహకారంతో క్లస్టర్ వర్సిటీని తన వంతు అభివృద్ధి చేశానని అన్నారు. రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ క్లస్టర్ భవిష్యత్‌లో ఒక మంచి విశ్వవిద్యాలయం అవుతుందన్నారు. చంద్రశేఖర్ కల్యాకర మాట్లాడుతూ గతంలో పీజీ చదవాలంటే మద్రాస్‌కు, తిరుపతికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు కర్నూలు జిల్లాలో నాలుగు వర్శిటీలు ఉన్నాయని అన్నారు. జేఎస్ఆర్‌కే శర్మ, ఎలమర్తి రమణయ్య క్లస్టర్ విశ్వవిద్యాలయంపై కవితలు చదవి వినిపించారు. అనంతరం ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, వాసంతి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వీవీఎస్ కుమార్, ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, హేమంత్, దేవికారాణి, అనూష హాజరయ్యారు.

సీపీఎం ఆధ్వర్యంలో భూపోరాటం


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

కల్లూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన భూపోరాటం రెండో రోజుకు చేరుకుంది. సోమవారం కల్లూరు తహసీల్దారు పేదలకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో పెద్దఎత్తున ప్రజలు కల్లూరు సర్వే నెంబరు 70-2 వద్దకు చేరుకున్నారు. అయితే పోలీసులు అక్కడికి చేరుకుని ప్రభు త్వ భూమిలో జెండాలు పాతకూడదంటూ సీపీఎం నాయకులతో పాటు పేదలను బయటికి పంపించి వేశారు. ఆగ్రహం వ్యక్తం చేసిన సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్‌తో పాటు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సీఎస్.రాధాకృష్ణ మంగళవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజశేఖర్, అలివేలమ్మ, అరుణ, గురుశేఖర్ రామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

'అసత్యపు ఆరోపణలు తగవు'

కర్నూలు కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసి యేషన్ అధ్యక్షుడిపై అసత్యపు ఆరోపణలు తగవని నగర ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంసీ.కాశన్న, కార్యదర్శి ఎం.రామ కృష్ణ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవోస్ అసోసియే షన్‌కు వ్యతిరేకంగా కొందరు వ్యక్తులు పని చేయడం వల్ల జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశంలో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. సస్పెండ్ అయిన వ్యక్తులు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారు అసత్య ఆరోపణలు చేయడం మాను కోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్ర కాష్, యూనియన్ నాయకులు శంకర్ నాయక్, మద్దిలేటి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చందన, లీలావతి, బంగారి, ఈశ్వరయ్య, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ప్రతి సచివాలయానికి వీఆర్వో ఉండాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం గ్రేడ్-2 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరణ చేపట్టనున్న నేపథ్యంలో వీఆర్వో గ్రేడ్-2 సమస్యలను పరిష్కరించాలని కోరారు. హేతుబద్ధీకరణతో మిగిలిపోయిన వీఆర్వోలను రిజిస్ట్రేషన్ శాఖ, సివిల్ సప్లయ్ శాఖలో శాశ్వత ఉద్యోగులుగా విలీనం చేయాలన్నారు. వీఆర్వోలకు కామన్ డీడీవోలుగా తహసీల్దార్ ఉండాలన్నారు. వీఆర్వో గ్రేడ్ విధానం తీసివేసి అసిస్టెంట్ పే స్కేల్‌ను కల్పించాలని కోరారు. అర్హత కలిగిన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆర్ఐలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

మత్స్యకారులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న బెస్త శ్రీనివాసులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బెస్త శ్రీనివాసులు కోరారు. మంగళవారం బీ.క్యాంపులోని పూలే భవన్‌లో మత్స్యకారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో చెరువులు, కుం టలు ఎండిపోవడంతో మత్స్యకారులు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వం మత్స్యకార భరోసా అందించాలని కోరారు. ఎద్దుల వెంకటేశ్, రాధా కృష్ణ, పరమేష్, గోపాల్ రాజ, తెలుగ కన్నా, శ్యాం, బెస్త సత్యనా రాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం స్థానిక బీ.క్యాంపు ఐఎఎస్ కళాశాలలో జాతీయ సైన్స్ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోస్టర్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు డీఈవో శామ్యూల్ పాల్, ఐఎఎస్ ప్రిన్సిపాల్ ఆది నారాయణ రెడ్డి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో రంగమ్మ, అధ్యాపకులు కె.మధుసూదన్, డాక్టర్ నాగలక్ష్మి, పార్వతిదేవి, కళ్యాణ్, ఎం.గోవిందరాజులు, పక్కీరయ్య, లింగమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నా రు.

● **విజేతలు వీరే:** జాతీయ సైన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు గెలుపొందారు. వ్యాసర చన పోటీల్లో ప్రథమ బహుమతి లిఖిత (డా. ఏపీజే అబ్దుల్ కలాం పాఠశాల విద్యార్థి, కర్నూలు), ద్వితీయ బహుమతి సుహానా (ప్రభుత్వ పాఠశాల, కర్నూలు), క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి ఎ.భార్గవి (రవీంద్ర విద్యానికేతన్); ద్వితీయ బహుమతి వంశిక (రవీంద్ర విద్యానికేతన్), పోస్టర్ కాంపీ టిషన్‌లో ప్రథమ బహుమతి పి.సంధ్యారాణి (గవర్నమెంటు హై స్కూల్), ద్వితీయ బహుమతి జాఫర్ శామ్యూల్ (జడ్పీహెచ్ఎస్, శరీన్‌నగర్), జూనియర్స్ విభాగంలో వ్యాసరచనలో ప్రథమ బహుమతి ఎస్.ముచితబాసూం (జడ్పీహెచ్ఎస్, శరీన్‌నగర్), ద్వితీయ బహుమతి యు.చరిత(జడ్పీహెచ్ఎస్, శరీన్‌నగర్), క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి వ్యూలారాణి (కర్నూలు మున్సిపల్ హైస్కూల్), ద్వితీయ బహుమతి రిషిక (జడ్పీహెచెస్, కర్నూలు), పోస్టర్ పోటీలో ప్రథమ బహుమతి సుమ (ఎంపీయుపీ, బీ.క్యాంపు), ద్వితీయ బహుమతి మహేంద్ర నాయు డు (ఎంపీయుపీ, బీ.క్యాంపు) దక్కించుకున్నారు.

ఎమ్మెల్సీకి అభినందన

కర్నూలు అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి అభినందనలు తెలిపారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణ జిల్లా అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఉమ్మడి గోదావరి జిల్లాలో టీడీపీ అభ్యర్థిగా పేరా బత్తుల రాజశేఖ ర్‌లు బరిలోదిగి అత్యధిక మెజార్టీతో గెలుపొందారన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మిపద్మా చౌదరి పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, చింతమానుపల్లె గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఎంపీడీవో రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని బోర్లకు, విద్యుత్ మోటార్లకు మర మ్మతులు చేయించాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ట్యాంక్‌ల దగ్గర మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వీరి వెంట సర్పంచులు ఉన్నారు.

8 నుంచి యాగంటీశ్వరుడి బ్రహ్మోత్సవాలు


యాగంటీశ్వరస్వామి ఆలయం, (ఇన్‌సెట్)లో స్వామివారు

ఓర్వకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి మంగళ వారం తెలిపారు. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, రాత్రి 9 గంటలకు సీతారాముల బృందం వారిచే చెక్కభజన, తెల్లవారుజామున 3 గంటలకు నందివాహనోత్సవం, 9న ఉదయం పం చామృతాభిషేకం, ధూపదీప నైవేదార్చన, రాత్రి 9 గంటలకు రేలా రేలారేలా, జానపద, జబర్దస్త్ వారిచే సినీ సంగీత విభావరి, తెల్లవారు జామున 4 గంటలకు రథోత్సవం, 10న సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు, సాయంత్రం పారువేట, నందికోల సేవ, పల్లకీ ఉత్సవాలు జరుగుతాయి.

● **8న అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు:** యాగంటీశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 8న అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొను టీమ్ సభ్యులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాన్నారు. విజేతలకు మొదటి, రెండో, మూడో, నాలుగో, ఐదో, ఆరో బహుమతులు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.6 వేలు, రూ.5 నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 8297978854, 7095464269 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ నెల 10న అంతర్ రాష్ట్ర స్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9701338439, 9963628175 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



యాగంటీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఎండలు అధికంగా ఉండటంతో నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేశాం.

– శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యుడు

పరిపాలన విషయాలు గోప్యంగా ఉంచండి

- మధ్యాహ్న భోజనానికి అరగంట కేటాయింపు
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పరిపాలన, ఆఫీసు విషయాల్లో మినిస్ట్రీరియల్ సిబ్బంది గోప్యత పాటించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో మినిస్టీరియల్ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్న భోజనం సమయంలో చాలా మంది సిబ్బంది ఎక్కువ సమయం తీసుకుంటున్నారని, మధ్యాహ్నం ఒకటి నుంచి 3 గంటలలోపు అరగంట మాత్రమే భోజనానికి వెళ్లాలని ఆదేశించారు. కార్యాలయంలో సీట్లు మార్పిడి చేయాలని కొందరు ఉద్యోగులు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. పరిపాలనను దృష్టిలో పెట్టుకుని సీట్లను మారుస్తామని ఏ సీట్లలో ఎవరూ ఉండాలో తాము నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. నాలుగో తరగతి సిబ్బంది అటెండెన్స్ డ్రస్ కోడ్, ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ డి.శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సిందు సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి ఏడీ వై.మల్లేశ్వరమ్మ, ఏవో శ్రీనివా సులు, ఆఫీసు సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, లతీఫ్ బేగ్, పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై స్వామి వారు


చంద్రప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు

కర్నూలు కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గోదారంగ నాథస్వామి దేవస్థానంలో ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడోరోజు మంగళవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజాలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రాతః ఆరాధన, అర్చన, సేవాకాలం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, హోమం, నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానం నిర్వహిం చారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు నవకలశ స్నపనం, అర్చనలు, నివేదన సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు ద్వారతోరణ ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, హోమము, నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానం నిర్వహించి, స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చక స్వాములు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు ఎస్‌యూ మహేశ్వరరెడ్డి, దోమా రామప్రసాద్, పెరుమాళ్ల బాలసుధాకర్, తల్లం నాగ నారాయణ రావు, చిత్రాల వీరయ్య పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐడీ అడిషనల్ ఎస్పీ


ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు సీఐడీ అడిషినల్ ఎస్పీ పూజిత మంగళవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల కర్నూలు సీఐడీ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించింది. మంగళవారం ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె వెంట సీఐలు పార్థసారధిరెడ్డి, గిరిబాబు ఉన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో సయ్యద్ సుల్తాన్ మహమూద్ షాఖాద్రి ఉరుసు సందర్భంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, అన్వర్‌బాషా ప్రారంభించారు. ఈ పోటీల్లో 12 టీములు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి నుంచి నాలుగు బహుమతులు వరుసగా రూ.15వేలు, రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురువులు ఎస్ఎండీ నజరుల్లా షాఖాద్రి, నాయకులు మద్దిలేటి, శివ రామకృష్ణా రెడ్డి, బండే నవాజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

గూడూరు మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జే మోహన్, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మాధవి, శేషమ్మ మాట్లాడుతూ గత సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన సమ్మె సందర్భంగా అధికారులు, పాలకులు ఆశా వర్కర్లతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోగా వారితో వెట్టి చాకిరి చేయిస్తుందని ఆరోపించారు. ఆశా వర్కర్ల సమస్యల పరి ష్కారానికి ఈనెల 6న విజయవాడలో జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఆదిలక్ష్మీ, గిరిజ, వరలక్ష్మీ, మునిరాబాను, సావిత్రి, ఆరిఫా, మనోహరమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఓర్వకల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ఏపీఎస్ఎఫ్ అధ్యక్షుడు నాగ సురేంద్ర మంగళవారం సబ్ రిజిస్ట్రార్ ఫిరోజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లు మండలాన్ని ఇండస్ట్రీరియల్ హబ్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రైతులు, ప్రజలు వస్తుంటారన్నారు. ఎండలు అధికంగా ఉన్నాయని, రిజిస్ట్రేషన్ వచ్చే ప్రజలు, రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రాము, వెంకటేశ్‌నాయక్, సద్దాం బాషా పాల్గొన్నారు.

కోడుమూరులో 'పొలం పిలుస్తోంది'

కోడుమూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పొలాల్లో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు మంగళవారం చేప ట్టారు. గాజులదిన్నె ప్రాజెక్టు కింద వేసిన కొర్ర పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రవిప్రకాష్ మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లో సుమారు 400 ఎకరాల వరకు రైతులు కొర్ర పంటను సాగు చేశారని అన్నారు. కొర్ర పంటకు ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా పంటను రక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మన్న, రామచంద్రుడు, గొల్లరాజు, కురువరాముడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడి మృతి

కర్నూలు రూరల్ మార్చి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం జి.శింగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అడ్డాకుల ఆదాము(64) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఆదాము ఈనెల 3న తన ఇంటి మెట్లు ఎక్కుతూ ప్రమాదవ శాత్తు అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేని ల్యాబ్‌లను సీజ్ చేయాలి: ఏఐవైఎఫ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వ ర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతి లేకుండా అర్హత లేనటువంటి వ్యక్తులు డయోగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నార న్నారు. ఈ విషయాన్ని పలుసార్లు వైద్యఆరోగ్య శాఖ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా కేంద్రాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బుధవారపేటలో ఉన్న అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్ యజమాన్యాలు దళారీలను ఏర్పాటు చేసుకుని నేరుగా కర్నూలు జీజీహెచ్‌లోని బెడ్ దగ్గరకు వెళ్లి శాంపిల్స్ తీసుకుని గ్రామీణులను దోపిడీ చేస్తున్నారన్నారు. శాంపిల్స్ తీసుకుని పరీక్షల కోసం వస్తున్న రోగుల సహాయకులకు మాయమాటలు చెప్పి తమ ల్యాబ్‌లకు తీసుకెళ్లి దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చంటికృష్ణ, శ్రీకాంత్, అఖిల్ నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎస్ఈ


అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ

కోడుమూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవనేనని ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ ద్వారకానాథ్‌రెడ్డి వర్క్ ఇన్‌స్పెక్టర్ మాదన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లెల్సీలో కాల్వలో ప్రవహిస్తున్న నీటిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా ఎల్లెల్సీ కోడుమూరు సబ్‌డివిజన్‌లోని 8ఎల్ కాల్వలను పరిశీలించారు. వృథాగా ప్రవహిస్తున్న నీటిని ఆయన పరిశీలించారు. జేఈ మోహన్‌రావు ఇచ్చిన ఐదు మోమోలకు ఎందుకు సమాధానం ఇవ్వలేదని ప్రశ్నించారు. రేపటిలోగా సమాధానం ఇవ్వకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఆయన వెంట ఇరిగేషన్ శాఖ డీఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ శైలేశ్వర్, జీడీపీ డీడీ విజయ్ కుమార్, జేఈలు మోహన్‌రావు, లక్ష్మన్న ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

కర్నూలు అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలకు ఎస్సీ హోదా కోసం ఈనెల 28న నగరంలోని కోల్స్ కాలేజీలో నిర్వహించే బహిరంగ సభను విజయంవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని జగదీష్ మాల్‌లోని టీచర్స్ అకాడమీలో సంఘం కుల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్స్ కళాశాల మైదానంలో ఉదయం 10గంటలకు జరగనున్న బుడగ, బేడ జంగాల సభకు ముఖ్య అతిథిగా మందక్రిష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఎమార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గుండా ఈశ్వర్య కేవీ రమణ, సుభాష్, భాస్కర్‌లు మాట్లాడారు. నాయకులు లక్ష్మయ్య, జమ్మన్న, శేఖర్, మద్దిలేటి పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి


వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసి, పీజీ ప్రవేశ పరీక్షలను యూనివర్సిటీలకు అప్పజెప్పాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఐక్య విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉపకులపతి వెంకట బసవరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం 77ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికి అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. యూజీసీ ప్రవేశపెట్టిన ముసాయిదా పూర్తిగా వర్సిటీలకు వ్యతిరేకంగా ఉందన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఈశ్వర్, అస్లాం, ఐసా నాయకుడు పవన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కార్యదర్శి భారతి, సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, పావని, సుధాదేవి పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి: సీపీఐ


మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు న్యూసిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర తరహాలో ఏపీలో కూడా కులగణన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పి.రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీ యూసీ జిల్లా కార్యాలయంలో చేతి వృత్తిదారుల సమాఖ్య సమితి అధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలతో దేశ సంపద 99 శాతం కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఈసమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా నాయకులు శేషఫణి, సీపీ ఎంఎల్ జనశక్తి నాయకులు సుంకన్న, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

కర్నూలు న్యూసిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మునెప్ప మాట్లాడుతూ ఆటో కార్మికులకు శాపంగా మారిన జీవో 21, 31ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాము, కార్యదర్శి ఈశ్వర్, ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, జి.చంద్రశేఖర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

చిన్న వయస్సులో వివాహాలు చేయొద్దు

కర్నూలు హాస్పిటల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయొద్దని డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌వో నన్నూరు ప్రాథమిక కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆడ పిల్లలకు పెళ్ళిళ్లు చేయకూడదన్నారు. కార్యక్రమంలో నన్నూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రతి సచివాల యం పరిదిలో నిర్వహిస్తున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు ప్రజలకు సహ కరించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో 2,73,576 మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారన్నారు.

హుండీ లెక్కింపు

కర్నూలు కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు జగన్నాథగ ట్టుపై వెలసిన ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని ఈవో వై.గుర్రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. మూడు రోజులపాటు జరిగిన శివరాత్రి ఉత్సవాల సేవా టికెట్ల ద్వారా రూ.4,57,300, విరాళాల ద్వారా రూ.1,12,660 మొత్తం రూ.5,69,960 వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే దేవాలయంలోని హుండీ లెక్కింపు ద్వారా రూ.3,07,292 ఆదాయం వచ్చి నట్లు ఆయన పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు

కల్లూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం పెద్దటేకూరులో ఏపీ రైతుసంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పుల్లన్న, మహమ్మద్, హేమంత్, పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు


మట్టి తవ్వుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

- కలెక్టర్ రంజిత్ బాషా
- అల్లుగుండు గ్రామంలో ఉపాధి పనుల తనిఖీ

వెల్దుర్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ఉన్నవారందరికీ ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మంగళవారం వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామంలో చేపడు తున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి వారి నుంచి వివాలను తెలుసుకున్నారు. వేతనాల నిధులు త్వరలో విడుదల అవుతాయని తెలిపారు. పనుల, మస్టర్ వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుం దని జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధిం చాలని డ్వామా పీడీ వెంకటరమణయ్యను ఆదేశించారు.

● కలెక్టర్ పలుగు చేతపట్టి కూలీలతో కలిసి మట్టి తవ్వారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి, ఆర్డీవో సందీప్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, ఎంపీడీవో సుహాసిని, డ్వామా ఏపీడీ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

పత్తికొండ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అంగన్‌వాడీ పోస్టులకు ఆర్డీవో భరత్ నాయక్, ఐసీడీఎస్ పీడీ నిర్మల ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు టీచర్ పోస్టులకు 26 మంది దరఖాస్తు చేసుకోగా, 23 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 27 ఆయా పోస్టులకు గానూ 82 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలకు 71 మంది హాజరయ్యారు. సీడీపీవో లలిత, వెల్దుర్తి సీడీపీవో లూకా, ఆలూరు సీడీపీవో శశికళ పాల్గొన్నారు.

సర్వేయర్ శిక్షణ దరఖాస్తుకు నేడు ఆఖరు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తుకు చేసుకునేం దుకు నేటితో గడువు ముగుస్తుందని న్యాక్ ఇన్‌చార్జి బీజీ ఉలుగన్న ఓ ప్రకటనలో తెలిపారు. 90 రోజులపాటు ఉచిత శిక్షణ ఇచికచ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడి యట్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆర్ట్స్ కళాశాల రహదారిలోని ఎంపీయూపీ పాఠశా లలో ఉన్న న్యాక్ శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కో-ఆర్డినేటర్ రాజశేఖర్ 9177413642, శిక్షణ నిపుణుడు రాజశేఖర్ 919885851817 నంబర్లను

పశువులకు టీకాలు వేయించాలి

మద్దికెర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ సూచించారు. బుధవారం పశువైద్యశాలలో పశువులకు టీకాలు వేశారు. టీకాలు వేస్తే పాలదిగుబడి తగ్గుతుందన్న అపోహలను వీడనాడాలని కోరారు. వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడతాయిన, నోటిలో గిత్తల మధ్య పుండ్లు వస్తాయని, పాలదిగుబడి సైతం తగ్గుతుందన్నారు. నాలుగు, ఆరు నెలల దూడలకు టీకాలు వేయించాలన్నారు. ఈ వ్యాదులు పశువుల నుంచి మనుషలకు వ్యాప్తి చెందే ప్రమాదం ఉదన్నారు.

సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజాముద్దీన్, ఎన్టీఆర్ నగర్ కాలనీల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ అధికార ప్రతినిధి విజయకృష్ణ, పట్టణ ఉత్తర విభాగ కార్యదర్శి వాల్మీకి చంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారధి పర్యటనలో మహిళలు మరుగుదొడ్ల సమస్యలపై విన్నవించారని, పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యువమోర్చా మాజీ కార్యదర్శి శ్రీనివాస ఆచారి, రమాకాంత్, రాము, కౌన్సిలర్ సురేష్, అంజయ్, సాయి, తాయన్న, నరసింహులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరుపాక్షి జన్మదిన వేడుకలు


బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్ కే గిరి

హొళగుంద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే విరుపాక్షి జన్మదిన సందర్భంగా ఎల్లార్తి షేక్షావల్లి షాషావలి సాహెబ్ దర్గాల్లో అన్నదానం చేసినట్లు వైసీపీ ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి మంగళవారం తెలిపారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశామని, అనంతరం అన్నదానం చేసినట్లు తెలిపారు. రామకృష్ణ, మృత్యుంజయ, శశి, దాదావలి, సద్దాం పాల్గొన్నారు.

హాస్టళ్లను నిర్లక్ష్యం చేసిన వైసీపీ


వంటగదిని పరిశీలిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్ కుమార్ విమర్శించారు. మంగళవారం పట్టణ శివారులోని ఎస్సీ కళాశాల హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, శిథిలావస్థకు చేరుకున్న భవనంలో విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ ఉన్నారని, తాగునీరు, విద్యుత్ కూడా సక్రమంగా లేదన్నారు. వార్డెన్ కనీసం పట్టించుకోవడంలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే పార్థసారధి దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం పెద్దతుమ్మల మండల అధ్యక్షుడు బెస్తా నాగరాజు, శివరాజ్ ,ఈశ్వర్, కాశి, ఉదయ్, విజయ్, విశ్వనాథ్, సాయి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంపై ర్యాలీ


పత్తికొండలోలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పత్తికొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా పత్తికొండలో ఆర్డీవో భరత్ నాయక్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పీడీ నిర్మల, డీఎల్‌డీవో అనూరాధ, ఎంపీడీవో స్వర్ణలత, సీడీపీవో లలిత పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే వేతనాలు

మద్దికెర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీలకు కొలతల ప్రకారమే వేతనాలు అందుతాయనీ ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. మంగళవారం మద్దికెర, బొజ్జనాయునిపేట గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. మేటీలు పనులను గుర్తించాలని. అవినీతి చోటుచేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు.

బాల్య వివాహాలను నివారించాలి


మాట్లాడుతున్న సీమ్యాట్ స్టేట్ డైరెక్టర్ మస్తానయ్య

పత్తికొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నివారించడం బాధ్యతగా తీసుకోవాలని సీమ్యాట్ స్టేట్ డైరెక్టర్ మస్తానయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం కైవల్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పత్తికొండ బాలికల గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మహిళా వివక్ష, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు ఉన్నట్లు సర్వేలలో తేలిందన్నారు. పత్తికొండ మండలం బాల్య వివాహాల్లో ముందుందన్నారు. ఎంఈవోలు తిమ్మారెడ్డి, రమేష్, గురుకులపాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, సొసైటీ సభ్యులు నాగసాయి పాల్గొన్నారు.

పోసానిపై కక్షతో వ్యవహరిస్తున్నారు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోసాని కృష్ణ మురళిపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నాయకులను టార్గెట్ చేస్తూ అరెస్టులకు తెరలేపిందన్నారు. ఆదోనిలో కూడా కేసు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో 15 కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నాడు టీడీపీ నాయకులు అయ్యన్న పాత్రుడు, అచ్చెన్నాయుడు వైఎస్ జగన్ కుటుంబ మహిళలపై మాట్లాడలేదా? అని ప్రశ్నించారు. కూటమి కక్షపూరిత రాజకీయాలను మానుకోవాల ని హితవు పలికారు. చంద్రకాంత్ రెడ్డి నర్సింలు, శ్రీలేఖ, దేవా ఇబ్రహీం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం


భూమి పూజ చేస్తున్న వీరభద్ర గౌడ్

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

హొళగుంద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. హొళగుంద నుంచి కడ్లేమాగి మజారా గ్రామానికి రూ.3కోట్ల 60 లక్షలు, నూతన బీటి రోడ్డు పనులకు మంగళవారం ఎంపీడీవో విజయ లలిత, పీఆర్ జీఈ యమునప్పతో కలిసి భూమిపూజ చేశారు. రోడ్డు పనులను నాణ్యతతో. వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, అర్హులైన లబ్ధిదారు లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతా యన్నారు. అలాగే ధనపురం నుంచి హొళగుందకు త్వరలో బీటీ రోడ్డు పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఎల్ఎల్‌సీ డీస్ట్రిబ్యూటరీ చైర్మన్ మిక్కిలిని శివప్రసాదా, రాజా పంపన్ గౌడ్, సురేంద్ర నాయుడు, వందవాగాలి శేషప్ప, బీజేపీ, జనసేన నాయకులు చిదానంద, అశోక్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని పెద్దతుంబళం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై మహేష్ కుమార్ తెలిపిన మేరకు.. కోసిగి మండలం ఆర్లబండ గ్రామానికి చెందిన వీరేష్, స్వామి ఆటోలో కర్ణాటక నుంచి మద్యంను తరలిస్తుండగా, కోసిగి క్రాస్ వద్ద మంగళవారం అదుపులో తీసుకున్నారు. రూ.30వేలు విలువ చేసే 5బాక్కుల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఆలూరు: సంగాల గ్రామ సమీపంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లలిత దేవి, ఎస్సై నవీన్ మంగళవారం తెలిపారు. మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల కృష్ణను అదుపులోకి తీసుకుని 7 బాక్స్‌ల మద్యం, బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి. రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి


సభత్వ నమోదు చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు కారన్న, సీపీఐ జిల్లా సమితి అధ్యక్షుడు వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం దూదేకొండ, కనకదిన్నె గ్రామాల్లో రైతుల సభ్యత్వ నమోదు నిర్వహించారు. అన్నదాత సుఖీభవ అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని కోరారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భ్రూణ హత్యలను నివారిద్దామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్యాలయంలో భ్రూణ హత్యల నివారణ, పిసీపీఎన్డీటి చట్టంపై స్కానింగ్ నిర్వాహకులు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రుల ఆలోచనలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలపై ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25వేల నుంచి రూ.లక్ష బహుమతి ఇచ్చే అవకాశం ఉందన్నారు. డిఎస్పీ హేమలత, డిప్యూటీ డిఎంహెచ్‌వో సత్యవతి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ అధికారి సుమలత, సీడీపీవో సఫర్‌నీసా బేగం, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


పార్టీలో చేరినవారితో ఉమాపతినాయుడు

ఆదోని, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పగల్లు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు 20 కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ నాయకుడు ఉమాపతి నాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కరగేని తిమ్మప్ప, ఓబులేష్, మల్లి, మునిస్వామి, తిమ్మప్ప, తిరుమల, టీడీపీ కుప్పగల్ గ్రామ నాయకులు షణ్ముఖ, వెంకటేష్, అయ్యప్ప రెడ్డి, తిమ్మారెడ్డి, రామకృష్ణ, శేఖర్, రామకృష్ణ ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తాం

ఆలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలం మరకట్టు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తామని గ్రామ సర్పంచ్ ఎల్లప్ప మంగళవారం తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు యువకులు అడిగారని స్థలం కేటాయింపుకు 2 రోజుల సమయం ఇవ్వాలని సూచించామన్నారు. ఎంపీడీవో అనుమతి తీసుకుని తీర్మానం చేస్తానని తెలిపామన్నారు. అయితే విగ్రహం ఏర్పాటుకు సర్పంచ్ అభ్యంతరం తెలుపు తున్నాడని ఆందోళన చేయడం సరికాదన్నారు.

జనన ధ్రువీకరణ తప్పనిసరి

మద్దికెర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారికి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చిన్నారులకు జనన ధ్రువీకరణ లేకుంటే ఆధార్ కార్డు రాదన్నారు. పుట్టిన పిల్లలకు 21రోజుల్లోపు పంచాయతీ, ప్రభుత్వ వైద్యశాలలో జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తారన్నారు. డీటీ శ్రీదేవి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

రూల్స్ పాటించకుంటే జరిమానా

తుగ్గలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు తప్పవని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌గౌడ్ హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలతో జరిమాతోపాటు జైలు శిక్ష కూడా పడుతుందన్నారు. లైసెన్సు, ఇన్సూరెన్స్, ఆర్సీ తప్పనిసరన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే జరిమానతోపాటు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు.

రైతుల కోసం పోరు

తుగ్గలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు సమస్యల పరిష్కారానికి పోరాడ తామని ఆ సంఘం కార్యదర్శి తిమ్మయ్య అన్నారు. మంగళవారం పెండేకల్ ఆర్ఎస్‌లో సీపీఐ, కౌలు రైతుల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మండల కార్యదర్శిగా పెండేకల్ మాబుపీరా, ఉపాధ్యక్షుడిగా టైలర్ నాగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌలురైతులకు కార్డులు ఇప్పించి ప్రభుత్వ సబ్సిడీలు అందేలా పోరాడుతామన్నారు.సీపీఐ నాయకులు సూరారెడ్డి, నాగరాజు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు అక్రమం

హొళగుంద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌డీపీఐ జాతీయ అధ్యక్షుడు ఎమ్‌కే ఫైజీని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్‌డీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ తమ జాతీయ అధ్యక్షుడిని అరెస్టు చేయ డం అసమ్మతి స్వరాన్ని అణిచివేసేం దుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రతీకార రాజకీయం తప్ప మరొకటి కాదన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి : ఏవో


సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న ఏవో సురేష్‌బాబు

దేవనకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేరుశనగలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి వస్తుందని ఏవో సురేష్‌బాబు సూచించారు. మంగళవారం దేవనకొండ రెవెన్యూలో పొలంబడి నిర్వహించారు. రైతులు సేంద్రియ పద్ధతులను అవలంబిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించ వచ్చునని అన్నారు. మండలంలో 469 మంది రైతులకు పీఎం కిసాన్ డబ్బులు అందలేదని, వారు త్వరగా ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. మండలంలో ఇంకా 3,500 మంది రైతులు గుర్తింపు కార్డులు చేసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రంగన్న, మల్లికార్జున, అబ్దుల్, వీహెచ్‌ఏ రంగాచారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల జీతాలు పెంచాలి


గజ్జెహళ్లిలో వినతిపత్రం ఇస్తున్నఆశా వర్కర్లు

హొళగుంద, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని సీఐటీయూ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 6న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం హొళగుంద, గజ్జెహళ్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు న్యూటన్, రాధమ్మకు వినతిపత్రాన్ని అందించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26వేలు, రూ.5లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. రిటైర్ అయ్యాక జీతంలో సగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సలోమి, మహాలక్ష్మి, పాతిమా, శ్వేతా, సిద్ధలింగమ్మ, బసమ్మ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలపై పోరాడతాం

తుగ్గలి: ఆశా వర్కర్ల సమస్యలపై పోరాడ తామని ఏపీసీపీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. మంగళవారం పగిడిరాయి, తుగ్గలి వైద్యశాలలో ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆశా వర్కర్లతో అన్ని రకాల సర్వేలు చేయించకూడదన్నారు. రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు.


జాతరలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలయ అభివృద్ధికి కృషి

హాలహర్వి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గూళ్యంలో వెలసిన గాదిలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ తాలూకా ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం జోడు రథోత్సవాల సంద ర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించారు. రథోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కురువ మల్లన్న, దిబ్బలింగ పాల్గొన్నారు.

నెలాఖరులోపు రూ.17కోట్ల లక్ష్యాన్ని అధిగమిస్తాం

- మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్ , మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోపు రూ.17కోట్ల లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆదోని వ్యవసాయ మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ మార్చి 5 తేదీ వరకు రూ.15.62 కోట్లు ఆదాయాన్ని సమకూర్చామని తెలిపారు. గత ఏడాది రూ.14.17 కోట్లు మాత్రమే వసూలైందని ఈ ఏడాది ఇప్పటికే రూ.కోటికి పైగా అధికంగా వసూళ్లు చేసినట్లు తెలిపారు. నెలారులోపు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయపు లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమిస్తామని తెలిపారు. పత్తి, వేరుశనగ వ్యాపారుల కొనుగోలు చేసిన వాటిపై కొంతమంది సెస్సు చెల్లించేందుకు ముందుకు వస్తున్నార న్నారని తెలిపారు. సీసీఐ కొనుగోళ్లకు సంబంధించిన సెస్సు త్వరలోనే చెల్లిస్తారన్నారు. మొండి బకాయిలను వదిలే ప్రసక్తి లేదని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

వలసల నివారణకు ఉపాధి పనులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు ఎపీవో శ్రీనివాసులు



ఆలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసల నివారణకు ఉపాధి పనులు కల్పిఆసత్మని ఆలూరు ఏపీవో ఎం.శ్రీనివాసులు తెలిపారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని జాబ్ కార్డులన్నాయి?

జవాబు: 8 వేల జాబ్ కార్డులు ఉన్నాయి.

ప్రశ్న: వలసల నివారణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊర్లోనే పనులు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. రోజుకు రూ.284 కూలి పడేలా చూస్తున్నాం.

ప్రశ్న: ఉపాధి పనుల్లో ఏ విధమైన పనులు చేస్తున్నారు?

జవాబు: చెరువులు, వాగుల్లో మట్టి పూడిక, కాల్వగట్టు, చెక్ డ్యాం నీటి గుంతల్లో పూడిక తీసే పనులు చేయిస్తున్నాం.

ప్రశ్న: పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నారా?

జవాబు: మండలంలో 250 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలను రైతులు సాగుచేసి ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నారు.

ప్రశ్న: పల్లె పండుగలో ఏ విధమైన పనులు చేశారు?

జవాబు: రూ.2.80కోట్ల ఉపాధి నిధులతో 53 గోకులం షెడ్లతో పాటు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాం.

ప్రశ్న: ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులో నిబంధనలు?

జవాబు: వారి పనితీరును బట్టి ఫీల్డ్ అసిస్టెంట్లను కొనసాగిస్తాం. వీరిని తొలగించే అధికారం ఎంపిడీవోకు ఉంటుంది.

ప్రశ్న: హౌసింగ్ పథకానికి జాబ్ కార్డు తప్పని సరి అన్న నిబంధన ఉందా?

జవాబు: ప్రభుత్వ నిబంధనల మేరకు హౌసింగ్ పథకానికి తప్పనిసరిగా జాబ్ కార్డు ఉండాలి. జాబ్‌కార్డు లేని వారు జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని ఉపాధి పనులకు హాజరు కావాలి.

మంత్రాలయంలో ప్రముఖులు


శ్రీమఠంలో సినీ దర్శకుడు పవన్ ఒడియార్

మంత్రాలయం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని కన్నడ ప్రముఖ సినీ దర్శకులు పవన్ ఒడియార్, బుల్లితెర నటులు శోభా శెట్టి, భర్త యశ్వంత్, బళ్లారి ఎంపీ ఈ తుకారామ్ మంగళవారం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వీరికి మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తిలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

శ్రీమఠానికి విరాళం: రాఘవేంద్రస్వామి మఠానికి పూణేకు చెందిన భూషణ్ అగలబట్టీ అనే భక్తుడు రూ. మూడు లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. మంగళవారం దాత కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చారన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

కోసిగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి సారిగా బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలు మంజూరు చేసింది. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కెనరా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు బ్యాంకు మేనేజర్లు కంబగిరి, శ్రీనునాయక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోసిగి మండలంలోని ఎస్‌బీఐ, కెనరా, ఆంధ్రప్ర గతి గ్రామీణ బ్యాంకులకు సంబంధించి 50 యూనిట్లకు 526మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడవద్దు

కోసిగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎం.పంపారెడ్డి (44) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి మంగళవారం జంపాపురంలోని పంపారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రాంపురంరెడ్డి సోదరులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు మురళీమోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంట్రాక్టరు బసిరెడ్డి, రంగారెడ్డి, శివశంకర్ రెడ్డి ఉన్నారు.

ఎట్టకేలకు బోరుకు మరమ్మతులు

కౌతాళం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళంలోని హనుమాన్ నగర్‌లో ఎట్టకేలకు బోరుకు మరమ్మతులు చేశారు. నీటి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీవాసులు ఎంపీడీవో సత్యన్న దృష్టికి తీసుకుపోగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి బోరింగ్‌కు మరమ్మతులను మంగళవారం చేయించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు అద్దాల శ్రీరాములు అధికారులను కోరారు.

ఎంపీడీవోకు సన్మానం

కౌతాళం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కౌతాళం నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సత్యన్నను మంగళవారం మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. గతంలో పని చేసిన ఎంపీడీవో సుబ్బరాజు పదవీ విరమణ చేయడంతో కౌతాళం ఏవోగా విధులు నిర్వహిస్తున్న సత్యన్నకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జీ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో టీడీపీ మండ అధ్యక్షుడు ఉలిగయ్య, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్, వైసీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి నాయకులు దాట్ల సుబ్బరాజు, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బంకులను తొలగించాలి'

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాచాని సోమప్ప జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల కాంపౌడు చుట్టు ప్రక్కల ఉన్న బంకులను తొలగించాలని వైఎస్ఆర్ నాయకులు కోరారు. మంగళవారం కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప, వైస్‌చైర్మన్ నజీర్ మాట్లాడుతూ బాలికల పాఠశాల చుట్టు ప్రక్కల ఉన్న బంకుల నుంచి అకతాయిల తాకిడి అధికంగా ఉండటంతో విద్యార్థినులు పాఠశాలకు రావడానికి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో శివ, నీలకంఠప్ప తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరతతో..
సంతలో అమ్మకానికి ఎద్దులు


ఎద్దులను సంతకు తరలిస్తున్న రైతులు

కోసిగి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండటంతో రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ఎద్దులను మంగళవారం కోసిగి సంతలో అమ్మకానికి పెట్టారు. కోసిగిలోని 9వ వార్డు రామక్కమ్మవ్వ కాలనీకి చెందిన సుమారు ఎనిమిది మంది రైతులు తమ ఎద్దులను అమ్మడానికి కోసిగి సంతకు తీసుకువచ్చారు. మూడు నెలల పాటు వ్యవసాయ పనులు లేకపోవడం, పశుగ్రాసం కొరత వల్ల పశువులను సంతకు తెచ్చామని రైతులు ఈరెడ్డి, అంజనేయ, ఎల్లప్ప, ఈరన్న కన్నీరు పెట్టారు.

చిత్తూరు ఎస్ఐగా నందవరం మండల వాసి

నందవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టా సోమాపురం గ్రామానికి చెందిన సోలోమోను సివిల్ ఎస్ఐగా మొదటి సారిగా సెలెక్ట్ అయ్యాడు. సాధారణ కుటుంబంలో పుట్టి చదువు పేదరికానికి అడ్డుకాదని నిరూపించారు. 2023లో సివిల్ ఎస్‌గా సెలెక్ట్ అయ్యి అనంతపురం జిల్లాలో పోలీసు ట్రైనింగ్ కళశాలలో శిక్షణ పూర్తి చేసుకుని 2024-2025 బ్యాచ్‌కు గాను చిత్తూరు జిల్లాకు అపాయింట్ తీసుకున్నట్లు తల్లిదండ్రులు సువర్ణమ్మ, శ్యామ్‌రావు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రమణీయం.. గంగాభవాని రథోత్సవం

పెద్దకడుబూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపురంలో వెలసిన గంగాభవాని జాతర సందర్భంగా బసలింగమ్మవ్వ ఆశీస్సులతో రథోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య అమ్మవారిని రథంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని ముందుకు లాగారు. కర్ణాటక, ఆంధ్ర భక్తులు పాల్గొని తమమొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రమాకాంతరెడ్డి, బసలదొడ్డిఈరన్న, వీరేష్ గౌడ్, మీసేవ నరసప్ప, సిద్దప్పగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు: గంగభవాని జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో గోనెగండ్ల, బాపురం జట్లు మధ్య హోరాహోరీగా సాగింది. గోనెగండ్ల జట్టు విజయం సాధించగా రూ. 20,016లను మంత్రాలయం టీడీపీ నాయకుడు రామకృష్ణ రెడ్డి అందజేశారు. రెండవ బహుమతి బాపురం జట్టుకు రూ 15,016లను, అలసందుగుత్తి జట్టుకు రూ 10,016లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు గణేష్, అంజి, మహదేవ, వీరేష్ గౌడ్, నరసప్ప, హనుమంతు పాల్గొన్నారు.


రథోత్సవానికి హాజరైన భక్తులు

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని ఎర్రకోట గ్రామంలో రామలింగేశ్వరస్వామి మహారథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ఆలయ అర్చ కులు జలాభిషేకం, బిల్వాభిషేకం, పుష్పాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం అశేష భక్తజనుల మధ్య రథాన్ని లాగారు.

మున్సిపల్ మార్కెట్లకు బహిరంగ వేలాలు

ఎమ్మిగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపల్ మార్కెట్ల వేలాలు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆశించిన స్థాయిలో వేలందారులు, వ్యాపారులు పాల్గొన లేదు. కేవలం నలుగురైదు మంది మాత్రమే పాల్గొని వివిధ మార్కెట్లను దక్కించుకున్నారు. వేలం ఆదినుంచి అంతం వరకు ఏకపక్షంగా సాగాయి. గతంతో పోల్చితే మార్కెట్ల వేలాలనుంచి మున్సిపాలిటీకి దాదాపు రూ. 6.40లక్షలు ఆదాయం పెరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ నిబంధనల మేరకు మున్సిపాలిటీకీ నెల నెల రుసుములను చెల్లించాలని, అలా చెల్లించని పక్షంలో మార్కెట్ కాంట్రాక్టును రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, సిబ్బంది, టీడీపీ నాయకులు ఆర్టీసీ అల్తాఫ్, వాల్మీకి రాజు, వేలం పాటదారులు పాల్గొన్నారు.


వేలాలను నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పాల్గొన్న వ్యాపారులు

కోసిగిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మంగళవారం ఆంధ్ర జ్యోతిలో 'కోసిగిలో పడకేసిన పారిశుధ్యం'.. అనే కథనాన్ని ప్రచురించడం తమైంది. గ్రామ సర్పంచ్ సంజిపోగు కుమారి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి స్పందించి సిద్దప్ప పాలెం, మారెమ్మదేవా లయం ముఖద్వారం రోడ్డులో నిండిపోయిన డ్రైనేజీలను పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. అలాగే మూడో వార్డు కింద మారెమ్మ దేవా లయం నుంచి చౌడేశ్వరి దేవాలయం బుగేని చెరువు వరకు నిండి పోయిన డ్రైనేజీని ఎక్స్‌కవేటర్‌తో చెత్తాచెదారం తొలగించారు. అలాగే చౌడేశ్వరి దేవాలయం ప్రధాన రోడ్డుపై పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కూడా తొలగించారు.


చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఈవో మాట్లాడుతూ పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు వారం రోజుల క్రితం ఫాగింగ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

● లాల్ క్రిష్ణయ్య, హౌసింగ్ డీఈ, మంత్రాలయం



మంత్రాలయం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలం ఉన్నవారు నూతన ఇంటి నిర్మాణానికి దరఖాస్తు తీసుకోవాలని మంత్రాలయం హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: నియోజకవర్గంలో స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?

జవాబు: ఇప్పటి వరకు స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం 6,812 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: ఇంటి నిర్మాణానికి ఏఏ పత్రాలు సమర్పించాలి?

జవాబు: ఇంటి నిర్మాణానికి కులం, ఆదాయం ఇంటి పట్టా దరఖాస్తుతో జత చేయాలి. ఆయా గ్రామాల్లోని సచివాలయంలో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అందజేయాలి.

ప్రశ్న: కొత్త ఇంటి నిర్మాణానికి ఎంత బిల్లులు మంజూరవుతుంది..?

జవాబు: పీఎంఏవై అర్బన్ ఎన్టీఆర్ హౌసింగ్ కింద ప్రతి లబ్ధిదారుడికి రూ.2.50 లక్షలు మంజూరు అవుతుంది. హౌసింగ్ పథకం కింద ఉపాధికి సంబంధం లేకుండా నేరుగా ఆయా నిర్మాణాల ప్రకారంగా రూ.2.50లక్షలు మంజూరవుతుంది.

ప్రశ్న: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు ఏమైనా అదనంగా పెంచారా..?

జవాబు: గతంలో రూ.1.80 లక్షలు మంజూరు అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీలు, వీవర్స్‌లకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా పెంచింది.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కౌతాళం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద గ్రామానికి చెందిన తొమ్మిదిమందిపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసినట్లు కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ ఉరుకుంద గ్రామానికి చెందిన శాంతకుమార్ తన స్థలం సర్వే కోసం రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకోగా రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు అర్జిదారుడితో కలిసి స్థలం వద్దకు వెళ్తుండగా గ్రామానికే చెందిన గట్టూరి ఉసేని, గట్టురి హరి, గట్టురి రమేష్‌తో పాటు మరో ఆరుగురు శాంతకుమార్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు తెలిపారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన వీఆర్‌ఏలను కూడా కొట్టినట్లు బాధితుడు శాంతకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఆటో చోరీకి గురైంది. మంగళవారం బాధితుడు రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఆటోను ఇంటి ముందు పెట్టానన్నారు. తీరా ఉదయం లేచి చూసే సరికి ఆటో కనిపించలేదన్నారు. చుట్టుపక్కల వెతికినా ఆటో కనిపించక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

అణగారిన వర్గాలకు అండగా బడ్జెట్

అసెంబ్లీలో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి



ఎమ్మిగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసేందుకు ఆదాయాన్ని పెంచి అణగారిన వర్గాలకు అండగా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై అసెంబ్లీలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. బడ్జెట్ ప్రజల ఆశలను, ఆశయాలను విస్మరించకుండా ఉందన్నారు. జీఎస్టీటీ 15శాతం గ్రోత్ సాధించే విధంగా ఉందన్నారు. మంచి బడ్జెట్‌పై మాట్లాడాల్సిన వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా బయ విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించే విధంగా బడ్జెట్ ఉందని హర్షం వ్యక్తం చేశారు.

ఆలయంలో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ చోరీ మంగళవారం జరిగింది. అర్ధరాత్రి ఆలయం వెనుక నుండి చొరబడి ముందుగా సీసీ కెమెరాలను కట్ చేసి లోపలికి వెళ్లిన దొంగలు రెండు హుండీలను పగలగొట్టారు. ఈ సంగతి మంగళవారం ఆలయ కమి టీ సభ్యులు తెలుసుకున్నారు. ఉదయం యధావిధిగా పైన ఉన్న దేవాలయాన్ని తెరచి చూడగా దొంగలు హుండీని పగలగొట్టి తెరవడానికి విఫలయత్నం చేసినట్లు గ్రహించారు. అయితే కింద ఉన్న దేవాలయంలోని అన్నదానం హాలు తలుపులకు వేసిన తాళాన్ని పగలగొట్టి లోపలికి వెళ్లి హుండీని పగలగొట్టి అందులోని నగదును దొంగలించారని కమిటీ సభ్యులు తెలిపారు. నగదు ఎంత పోయిందీ తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసులను అడగగా తమకు ఫిర్యాదు అందలేదని అన్నారు.

'నిధులు వచ్చినా అభివృద్ధి ఏది'?

కోసిగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయని, అయితే పంచాయతీల్లో ఎక్కడ అభివృద్ధి కనపడడం లేదని జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పందికోన రాజేష్ అన్నారు. మంగళవారం కోసిగిలో విలేకరుల సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ కోసిగిలో దోమల తీవ్రత అధికంగా ఉందని, పంచాయతీ అధికారులకు సమస్య తెలియజేసినాచాలా కాలనీల్లో ఫాగింగ్ చేయలేదన్నారు. గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినా పంచాయతీ అధికారులు మాత్రం కోసిగిని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు.

నందవరంలో సభ్యత్వ నమోదు

నందవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు మాట్లాడుతూ ఈ నెల 11 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమం నాయకులు శాంతన్న, గాలెన్న, గిడ్డయ్య, మన్సూర్, ముని, పంపయ్య, రామన్న, గాలెప్ప పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు హద్దులు చూపించాలి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పర శ్మశాక వాటికకు హద్దులు చూపించాలని ఉప్పర సంఘం పట్టణ అధ్యక్షుడు యు.కె. వీరేంద్ర కోరారు. మంగళవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పట్టణంలో భూముల విలువ పెరుగుతుండడంతో శ్మశాన వాటిక కబ్జాకు గురవుతుందన్నారు.

తాగునీటి ట్యాంకుల ఏర్పాటు

గోనెగండ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గాను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఏఈ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం గ్రామానికి నాలుగు నీటి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. బుధ, గురు, శుక్రవారాలలో ఉరుసు ఉన్నందున నీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరుకు మరమ్మతు చేయించి నీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోనెగండ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు మంగళవారం పరిష్కరించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గంజహళ్లి గ్రామంలో తాగునీటి ఇక్కట్లు' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఏఈ శ్రీనివాసరెడ్డిలు గంజహళ్లి గ్రామంలోని హంద్రీనదిలో ఉన్న బోరును పరిశీలించి మరమ్మతు చేయించారు. అలాగే నీటిని గ్రామానికి మళ్లించారు. దీంతో గ్రామంలోని పలు వీధులలో నెలకొన్న తాగునీటి సమస్య తీరింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటే శ్వర్లు, సర్పంచ్ లింగమ్మ, గ్రామ పెద్దలు రాముడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయడమే లక్ష్యం

ఎమ్మిగనూరు రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేకూర్చడమే కృషి విజ్ఞాన కేంద్రం ముఖ్య ఉద్దేశమని ఆచార్య ఎన్జీ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు శివనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 15వ శాస్త్రీయ సలహా సంఘ సమావేశం డాక్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వ్యవస్థాపకులను ప్రోత్సహించాలన్నారు. ఉత్పత్తులు, విలువ జోడించడంతో అధిక ఆదాయం పొందవచ్చు అన్నారు. రైతులు, రైతు ఉత్పత్తి దాయులు సంఘాలుగా ఏర్పడాలన్నారు. దీంతో రైతులకు మేలైన మార్కెటింగ్‌తో పాటు రుణ సౌలభ్యం ఉంటుందన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో సాగు చేస్తున్న సపోట, నిమ్మ పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ శ్యామల, ఖాద్రీ, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి పాల్గొన్నారు.

నవోదయం పోస్టర్ల ఆవిష్కరణ

కోసిగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత కోసిగి మండలంగా మార్చడమే నవోదయం 2.0 ధ్యేయమని కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా రహిత సమాజం నిర్మాణం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవోదయం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, గ్రామస్థులు రామయ్య, రాజశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సకాలంలో 'ఉపాధి' కూలి ఇవ్వాలి

పెద్దకడుబూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి కూలీలకు సకాలంలో కూలి ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిక్కన్న, మండల కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దకడబూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగరాజు స్వామికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మరణిస్తే రూ.పదిలక్షల ఏక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నాయకులు రాముడు, మహ్మద్ రఫిక్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు

కోసిగి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోసిగి శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు పూజలు చేశారు. అర్చకులు ఉదయం నుంచే అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి, పుష్పాలంకరణ చేసి ఆకు పూజ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

హామీలను విస్మరించడం సరికాదు


ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

నందవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించడం సరికాదని సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి రాముడు అన్నారు. మంగళవారం హాలహర్వి పీహెచ్‌సీ దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశావర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఇతర ఉద్యోగుల మాదిరిగా ఇక్రిమెంట్లు, హెచ్‌ఆర్‌ఏ, టీఏడీఏలు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం డాక్టర్ విజయభారతికి అందజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 6న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో శారద, జ్యోతి, పరిమళ, శిరిష, హరాత, రోజా, రమణి, సుశీల పాల్గొన్నారు.

మహిళలు ఆర్గానిక్ ప్యాడ్‌లు వినియోగించాలి


ఆర్గానిక్ ప్యాడ్ గురించి వివరిస్తున్న డాక్టర్ సంధ్యారాణి

ఎమ్మిగనూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రుతుస్రావం సమయంలో మహిళలు బయోడిగ్రేడబుల్ కానీ, రసాయన శానిటరీ ప్యాడ్‌లను వినియోగిస్తే ఆనారోగ్యానికి గురికావటంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆర్‌డబ్ల్యూఎఫ్ సంస్థ మాస్టర్ ట్రైనీ డాక్టర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని మెప్మా కార్యాలయం దగ్గర నారీకి రక్ష- దేశ్‌కి సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో లభించేవాణిజ్య శానిటరీ ప్యాడ్స్‌లో వాడే థాలేట్, ప్లాస్టిక్, రేయాన్, సెల్యులోజ్‌జెల్‌తో పాటు ఇతర బ్లీచింగ్, రసాయన సింథటిక్ ఫైబర్లు మహిళల ఆరోగ్యాన్ని హరిస్తాయన్నారు. కాబట్టి ఆర్గానిక్ (సేంద్రియ)ప్యాడ్స్‌ను వినియోగించాలని సూచించారు. సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ డివిజనల్ అధికారి జోనాథన్ వీక్లీఫ్, మెప్మా పీఆర్ఓ జయవర్ధన్, సీవో లలిత, సీనియర్ అసిస్టెంట్ ఉరుకుందమ్మ, మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా: సీఐ

గోనెగండ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలో నేటి నుంచి జరుగుతున్న బడేసాహెబ్ ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక బందోబస్తు, నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు గోనెగండ్ల సీఐ గంగాధర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ గంజహళ్లి గ్రామంలో జరుగుతున్న ఉరుసుకు 160 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడమే గాక డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఉరుసులో మద్యం తాగి అల్లర్లు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

● పెళ్లి వేడుకలు, ఊరేగింపులలో డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ గంగాధర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధిక శబ్దం వచ్చే మైక్, డెక్కులకు డీఎస్పీ ద్వారా అనుమతి తీసుకోవాలని సూచించారు.